- aruhi group
www.mahaaprabha.com

నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

గురువారం
3-09-2026

సంపుటి : 01 సంచిక :163 పేజీలు : 08 వెల : ₹5/- తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.

Published From RANGAREDDY TELANGANA.RNI NO : TGTEL/26/A0738 VOLUME 01 ISSUE163 NAMASTEY MAHAAPRABHA



Mr. NAKKA RAJU
Chairman of Mahaaprabha

మళ్లీ వార్ సెగలు



- భగ్గుమన్న పశ్చిమాసియా
- టెహ్రాన్‌లోని సైనిక స్థావరాలపై అమెరికా దాడులు
- ప్రతీకారేచ్ఛతో రగిలిన ఇరాన్..
- జోర్డాన్, బహ్రెయిన్, ఇరాక్, కువైట్‌లోని యూఎస్ లక్ష్యాలపై ఎటాక్
- హార్ముజ్‌ను ట్రంప్ జలసంధిగా మార్చాలా?
- ప్రజల్ని ప్రశ్నిస్తూ ట్రూత్ సోషల్‌లో ట్రంప్ పోస్ట్

వైఎస్సార్ ఆశయాలను నెరవేరుస్తాం

ప్రాణహిత--చేవెళ్ల, ఎస్ఎల్‌బీసీ, కల్వకుర్తి ప్రాజెక్టులు పూర్తి చేస్తాం: సీఎం రేవంత్‌రెడ్డి

- తెలంగాణలో 16 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని ప్రకటన
- వైఎస్సార్ చివరి కోరికను నెరవేర్చేందుకు కలిసికట్టుగా పనిచేద్దామని పిలుపు
- రైతుల కోసం వైఎస్సార్ చేసిన సేవలను గుర్తుచేసుకున్న సీఎం
- రైతులకు ఉచిత విద్యుత్‌పై తొలి సంతకం వైఎస్సార్‌దేనని వెల్లడి
- రూ.1,300 కోట్ల విద్యుత్ బకాయిలు రద్దు చేసిన మహానేత
- వైఎస్సార్ అవార్డు--2026 ప్రదానం
- ఎం.ఎస్. స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్‌కు అవార్డు
- ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో ఘనంగా కార్యక్రమం





న్యూఢిల్లీ: సెప్టెంబర్ 2 : (మహాప్రభ)

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయమైన ప్రాణహిత--చేవెళ్ల, ఎస్ఎల్‌బీసీ, కల్వకుర్తి ఎత్తిపోతల ప్రాజెక్టులను పూర్తి చేసి తెలంగాణ సమాజానికి అంకితం చేస్తామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ ప్రాజెక్టుల ద్వారా తెలంగాణలో 16 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. న్యూఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో డాక్టర్ వైఎస్సార్--డాక్టర్ కేవీపీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అవార్డు--2026 ప్రదానోత్సవ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. భారతీయ వ్యవసాయం, ఆహార భద్రత, సుస్థిర అభివృద్ధి, గ్రామీణ జీవనోపాధి రంగాల్లో విశేష కృషి చేస్తున్న ఎం.ఎస్. స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్‌కు -మిగతా 3 లో



4న జీఎస్ఎల్‌వీ-ఎఫ్17 రాకెట్ ప్రయోగం

- తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఇస్రో చైర్మన్ వి.నారాయణన్
- ఈఓఎస్-05 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్న ఇస్రో
- జీఎస్ఎల్‌వీ సిరీస్‌లో ఇది 19వ ప్రయోగం
- సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ రెండో లాంచ్ ప్యాడ్ నుంచి ప్రయోగం
- జియో ప్లాట్‌ఫామ్‌పై ప్రయోగిస్తున్న తొలి భారతీయ ఉపగ్రహం ఈఓఎస్-05
- భూమి పరిశీలనకు ఉపగ్రహం ద్వారా కీలక చిత్రాల సేకరణ
- ప్రయోగం విజయవంతం కావాలని శ్రీవారిని దర్శించుకున్న ఇస్రో చైర్మన్



ఊబర్‌లో 3,300 ఉద్యోగాల కోత..

- రోబోటాక్సీల పోటీ నేపథ్యంలో భారీగా సిబ్బంది తగ్గింపు
- 10 శాతం ఉద్యోగులను తొలగించనున్న ఊబర్
- కొవిడ్ తర్వాత ఇదే అతిపెద్ద ఉద్యోగాల కోత
- మేనేజ్‌మెంట్ స్థాయిలను సరళీకరించేందుకు నిర్ణయం
- సంస్థాగత సంక్లిష్టతను తగ్గించడమే లక్ష్యమన్న సీఈవో
- భవిష్యత్ వృద్ధి, ఆవిష్కరణలకు పాడుపు వినియోగం



కాంగ్రెస్‌ను కొందరు కబ్జా చేయాలని చూస్తున్నారు

- "కాంగ్రెస్‌లో కొత్తవాళ్ల పెత్తనాన్ని సహించబోను"
- కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు
- నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం జరగదని వ్యాఖ్య
- వైఎస్సార్ స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చానని వెల్లడి
- 'సీఎం.. సీఎం' అంటూ కార్యకర్తల నినాదాలపై కీలక వ్యాఖ్యలు

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి:సెప్టెంబర్ 2 : (మహాప్రభ)

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న పరిణామాలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కొత్తగా పార్టీలోకి వచ్చిన కొందరు కాంగ్రెస్‌ను కబ్జా చేసి అధికారం చెలాయించాలని చూస్తున్నారని ఆరోపించారు. అలాంటి ప్రయత్నాలను తాను చూస్తూ ఊరుకోబోనని హెచ్చరించారు. తెలంగాణలో వైఎస్ రాజశేఖర్ రెడ్డికి లక్షలాది మంది అభిమానులు ఉన్నారని రాజ్‌గోపాల్ రెడ్డి అన్నారు. తాము వైఎస్సార్ నిజమైన శిష్యులమని పేర్కొన్నారు. -మిగతా 3 లో

దానం కాదు.. పరిహారం కావాలి



- భారత్, చైనా, అమెరికాతో మాకు ముప్పు
- కాలుష్యాన్ని విపరీతంగా వెదజల్లుతున్నాయి
- ఇటీవలి వరదలకు కారణమయ్యాయి
- ఆ మూడు దేశాలు నష్ట పరిహారం చెల్లించాలి
- నేపాల్ విదేశాంగ మంత్రి డిమాండ్
- ఐరాసను ఆశ్రయించే దిశగా నేపాల్ పీఎం
- 1,127కు చేరుకున్న మృతుల సంఖ్య
- మూడు నదుల ఉగ్రరూపంతో వరద ముప్పు



కేసీఆర్ రాజీనామా చేస్తే సోనియానే వణికింది..

నీకు తట్టుకునే దమ్ముందా? రేవంత్‌పై కేటీఆర్ ఫైర్

- కేసీఆర్ రాజీనామాలతోనే తెలంగాణ సాధ్యమైందన్న కేటీఆర్
- రాజీనామా చేస్తే ఢిల్లీ గడగడా వణికిందని వ్యాఖ్య
- సోనియా గాంధీ తట్టుకోలేక తెలంగాణ ఇచ్చారంటూ విమర్శ
- కేసీఆర్ రాజీనామాపై రేవంత్ పదేపదే మాట్లాడటంపై ఆగ్రహం
- "నీ నుంచి అయితదా రేవంత్?" అంటూ కేటీఆర్ సూటి ప్రశ్న
- పనికిమాలిన మాటలు మాని.. పనికొచ్చే పని చేయాలని హితవు

హైదరాబాద్ సెప్టెంబర్ 2 : (మహాప్రభ)

ఉద్యమ నాయకుడు, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు రాజీనామాలు కొత్త కాదు. ఆయన రాజీనామా చేస్తేనే ఢిల్లీనే దిగివచ్చి ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిందని కేటీఆర్ అన్నారు. బుధవారం మాజీ మంత్రి హరీశ్ రావుతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి 1000 రోజుల దగా పాలనపై తెలంగాణ భవన్‌లో 'ఛార్జ్ షీట్'ను విడుదల అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. మాటిమాటికి రేవంత్ రెడ్డి కేసీఆర్ రాజీనామా చేయాలని అసందర్భంగా మాట్లాడుతున్నాడు.కేసీఆర్ రాజీనామా చేస్తే ఢిల్లీ గడగడా వణికింది. వీపు పుగులతదని అర్థమై తప్పని సరి పరిస్థితుల్లో చివరికి మీ నాయకురాలు సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చింది. కేసీఆర్ రాజీనామా -మిగతా 3 లో



రామ మందిరం తొలి సీఈవోగా జితేంద్ర మిశ్రా

ఆపరేషన్ సిందూర్‌లో వెస్ట్రన్ ఎయిర్ కమాండ్ చీఫ్‌గా సేవలు

- జితేంద్ర మిశ్రా నియామకానికి శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆమోదం
- ఎయిర్ మార్షల్‌కు కీలక బాధ్యతలు
- విరాళాల చోరీ ఆరోపణల నేపథ్యంలో ట్రస్ట్ సమావేశం
- ముగ్గురు కొత్త ట్రస్టీల నియామకం
- మహేష్ భాగ్‌చంద్కా, మదన్ మోహన్ పాండే, నిర్మలా యాదవ్‌కు చోటు
- రామ మందిర నిర్వహణలో సీఈవోది కీలక పాత్ర
- దేశ ప్రజలకు సేవ చేసే అవకాశం దక్కడం గర్వంగా ఉందన్న జితేంద్ర మిశ్రా

బీసీ మహిళ కాబట్టే కుట్రలు

అందుకే టార్గెట్ చేశారు

- అన్ని విషయాలు ఖర్గేకు వివరించా
- నా కూతురు వ్యాఖ్యలకు నన్ను బాధ్యురాలిని చేయొద్దు
- నాపై మాట్లాడిన నేతలకూ నోటీసులు ఇవ్వాలని కోరా
- పదవిలో కొనసాగించాలని ఖర్గేను అడిగాను
- మీడియాతో మంత్రి కొండా సురేఖ వెల్లడి



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2 : (మహాప్రభ)

బీసీ మహిళను కాబట్టే తనను టార్గెట్ చేశారని మంత్రి కొండా సురేఖ ఆగ్రహం వ్యక్తం చేశారు. తన కూతురు చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయడం సరికాదన్నారు. తెలంగాణ కాంగ్రెస్‌లో తనపై కొనసాగుతున్న వివాదానికి తెరదించుకునేందుకు మంత్రి కొండా సురేఖ ఢిల్లీ వేదికగా తన వాదనను హైకమాండ్ ముందు బలంగా వినిపించినట్లు వెల్లడించారు. సమావేశం అనంతరం సాయంత్రం మీడియాతో మాట్లాడుతూ.. బుధవారం మధ్యాహ్నం కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి తనకు ఇచ్చిన షోకాజ్ నోటీసు, తనపై వచ్చిన ఫిర్యాదులు, తన కుమార్తె చేసిన వ్యాఖ్యలపై తనను బాధ్యురాలిని చేస్తున్నారని, వాటిపై వివరణ ఇచ్చానన్నారు. అనంతరం రాష్ట్ర కాంగ్రెస్ -మిగతా 3 లో

1000 రోజుల కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ నిరసన

-'420 హామీలు--420 ఫీట్లు' ప్లెక్సీతో ఆందోళన..

-హామీల అమలుపై మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ధ్వజం



ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 2, (మహాప్రభ)

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఎల్లారెడ్డి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.'420 హామీలు--420 ఫిట్లు', 'వద్దురా నాయన కాంగ్రెస్ పాలన' అంటూ నినాదాలు చేస్తూ బీఆర్ఎస్ నాయకులు నిరసన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ 'కాంగ్రెస్ బాకీ కార్డు'తో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జాజాల సురేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలులో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. మహిళలకు నెలకు రూ.2,500 సాయం, తులం బంగారం, రైతు భరోసా, రూ.2 లక్షల రుణమాఫీ, వడ్లకు రూ.500 బోనస్, పెంచిన పింఛన్లు, నిరుద్యోగ భృతి, విద్యా భరోసా కార్డులు, రెండు లక్షల ఉద్యోగాల వంటి హామీలను ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు.ప్రజలకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులను కాంగ్రెస్ ప్రభుత్వం నిరాశకు గురిచేస్తోందని అన్నారు. హామీలన్నీ అమలు చేసే వరకు బీఆర్ఎస్ ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధిలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలపై ప్రస్తావిస్తూ, ప్రస్తుత ఎమ్మెల్యే మదన్ మోహన్ తీరుపై సురేందర్ విమర్శలు చేశారు. హాస్టళ్లలో విద్యార్థులు మృతి చెందిన ఘటనలపై కూడా ప్రభుత్వం స్పందించాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, యువకులు, పార్టీ శ్రేణులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

దేవరకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం



దేవరకొండ సెప్టెంబర్ 2 (మహాప్రభ)

దేవరకొండ పట్టణంలోని ఎం.కె.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల(అటానమస్),దేవరకొండలో 2026- 27 విద్యా సంవత్సరానికి ఖాళీగా ఉన్న "హెల్త్ కేర్" అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రమావత్ రవి బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఎం.ఎస్.సి. (మీఎ) హెల్త్ కేర్ లో పీజీ పూర్తి చేసి 55% మార్కులు ఉన్నవారు అర్హులని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50% మార్కులు ఉండాలని పేర్కొన్నారు. పీహెచ్‌డి /నెట్/ సెట్ మరియు బోధన అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి మరియు అర్హత గల అభ్యర్థులు తమ దరఖాస్తు ఫారాలను కళాశాల కార్యాలయంలో 03/09/2026 వ తేదీ సాయంత్రం 4:30 గంటల లోపు అందజేయాలని తెలిపారు. ఇంటర్వ్యూ తేదీ మరియు సమయము, ఇంటర్వ్యూ జరుగు స్థలం వివరాలను అభ్యర్థులకు చరవాణి ద్వారా తెలియజేస్తారని పేర్కొన్నారు. ఇతర వివరాలకు సెల్ :9912740993 సంప్రదించాలని తెలిపారు.

జీనుగురాలలో ఘనంగా గ్రామపంచాయతీ ప్రణాళిక గ్రామసభ

- అభివృద్ధి ప్రణాళికలపై ప్రజల అభిప్రాయాల సేకరణ



దేవరకద్ర సెప్టెంబర్ 2 : (మహాప్రభ)

దేవరకద్ర మండలంలోని జీనుగురాల గ్రామంలో గ్రామపంచాయతీ ప్రణాళిక గ్రామసభను ఘనంగా నిర్వహించారు. అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) మధుసూదన్ నాయక్ సమక్షంలో జరిగిన ఈ గ్రామసభలో గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, ప్రాధాన్యతా పనులు తదితర అంశాలపై గ్రామ ప్రజల నుంచి అభిప్రాయాలు, సూచనలు సేకరించారు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధి ప్రణాళికను రూపొందించడం గ్రామసభ ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ నాగమ్మ సాయిలు, ఉపసర్పంచ్ నరహరి, పంచాయతీ వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధికి ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

భారీ ర్యాలీ బహిరంగ సభ
కాంగ్రెస్ 'ఆరు గ్యారెంటీలు' పచ్చి మోసం





-దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్

-దేవుడి సాక్షిగా ఒట్టేసి ప్రజలను వంచించిన కాంగ్రెస్

-- వచ్చే నెల అన్నారు.. 100 రోజులన్నారు.. 1000 రోజులు కావస్తున్నా అమలు శూన్యం

-- ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లించాల్సిన బాకీలను వెంటనే చెల్లించాలి

-- రైతులు, మహిళలు, యువతను నట్టేట ముంచిన రేవంత్ రెడ్డి సర్కార్

దేవరకొండ సెప్టెంబర్ 2 (మహాప్రభ)

కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 'ఆరు గ్యారెంటీలు', 420 హామీలను అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను తీవ్రంగా వంచించిందని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.బుధవారం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల విఫల పాలనకు నిరసనగా దేవరకొండ నియోజకవర్గ కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి, బస్‌స్టాండ్ వద్ద మహాధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రమావత్ రవీంద్ర కుమార్....మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు, రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, ఉద్యోగులు, సంక్షేమ పథకాల పరిస్థితిపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.ఎన్నికల సమయంలో అప్పటి పీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్కతో పాటు కాంగ్రెస్ అభ్యర్థులు దేవాలయాల్లో దేవుళ్ల సాక్షిగా ఒట్లు వేసి 'గ్యారెంటీ కార్డులు' పంపిణీ చేశారని ఆయన గుర్తుచేశారు. 2023 డిసెంబర్ 9న అధికారంలోకి వచ్చిన మొదటి రోజే సంతకం చేసి, 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలను సంపూర్ణంగా అమలు చేస్తామని ప్రజలను నమ్మించారని తెలిపారు. అయితే 100 రోజుల గడువు దాటి దాదాపు 1000 రోజులు కావస్తున్నా హామీల అమలు మాత్రం శూన్యంగా ఉందని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయని హామీల కారణంగా వివిధ వర్గాలకు చెల్లించాల్సిన బకాయిలను రమావత్ రవీంద్ర కుమార్ వివరించారు.మహిళలకు: 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని, ఈ లెక్కన ఒక్కో మహిళకు రూ.82,500 బకాయి ఉందన్నారు.కళ్యాణలక్ష్మి: పథకం కింద తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని, దేవరకొండ నియోజకవర్గంలో చెక్కులు పొందిన సుమారు 5,000 మంది ఆడబిడ్డలకు తులం బంగారం బకాయి ఉందన్నారు.మహిళా విద్యార్థినులు: అర్హులైన విద్యార్థినులకు ఉచిత స్కూటర్ల పంపిణీ హామీని గాలికొదిలేశారని విమర్శించారు.రైతులు: ఎకరానికి రూ.15,000 రైతు భరోసా ఇస్తామని చెప్పి, పాత పథకం కింద ఇచ్చే మొత్తాన్ని కూడా సక్రమంగా ఇవ్వలేదని ఆరోపించారు. నాలుగు ఎకరాల రైతుకు రైతు భరోసా రూపంలోనే దాదాపు రూ.1,02,000 బకాయి ఉందన్నారు.పింఛన్లు: వృద్ధులు, వితంతువులు, బీడీ కార్మికులకు ఇస్తున్న రూ.2,000 పింఛన్‌ను రూ.4,000కు పెంచుతామని హామీ ఇచ్చి అమలు చేయలేదని, పెంచాల్సిన రూ.2,000 చొప్పున ఒక్కో లబ్ధిదారునికి రూ.66,000 బకాయి పడిందన్నారు.దివ్యాంగులు: రూ.6,000 పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని, ఒక్కో దివ్యాంగుడికి రూ.66,000 బకాయి ఉందన్నారు.రుణమాఫీ: రూ.2 లక్షల పూర్తిస్థాయి రుణమాఫీ చేస్తామని చెప్పి రైతులను మోసం చేశారని ఆరోపించారు.ధాన్యం బోనస్: వడ్ల కొనుగోలుపై క్వింటాలుకు రూ.500 బోనస్ అన్ని రకాల ధాన్యానికి ఇస్తామని చెప్పి, ఇప్పుడు నిబంధనల పేరుతో రైతులను మోసం చేస్తున్నారని విమర్శించారు.ఎకరానికి రూ.12,500 చొప్పున గత ఆరు పంటలకు కలిపి రైతుకు రూ.75,000 వరకు బోనస్ బకాయి ఉందన్నారు.వ్యవసాయ, ఉపాధి కూలీలు: ఏడాదికి రూ.12,000 ఇస్తామని హామీ ఇచ్చిన నేపథ్యంలో రెండేళ్లకు రూ.24,000 చొప్పున బకాయి ఉందన్నారు.ఆటో డ్రైవర్లు: ఏడాదికి రూ.12,000 చొప్పున రెండేళ్లకు రూ.24,000 ప్రభుత్వం చెల్లించాల్సి ఉందన్నారు. విద్యార్థులు: రూ.5 లక్షల విద్యా భరోసా కార్డుల హామీ అమలు కాలేదని, గత ప్రభుత్వం నుంచి పెండింగ్‌లో ఉన్న దాదాపు రూ.12,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.నిరుద్యోగులు: నెలకు రూ.4,000 నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని, ఈ లెక్కన ఒక్కో నిరుద్యోగికి రూ.1,32,000 బకాయి పడిందన్నారు.

– ఉద్యోగాలు: రెండు లక్షల ఉద్యోగాల భర్తీ హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదని విమర్శించారు.రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, నిరుద్యోగులు, కార్మికులు ఇలా అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని రమావత్ రవీంద్ర కుమార్ మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయడంతో పాటు ప్రజలకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు.ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, యువత, రైతులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం-2005 పట్ల పిఐఓల నిర్లక్ష్యం

-సహ చట్టం గురించి పిఐఓలకు తెలుసా..?

-రైట్ టు ఇన్ఫర్మేషన్ ఆక్టివిస్ట్ సొసైటీ (ఆర్టీఐఎఎస్)-రాష్ట్ర అధ్యక్షులు డా,, కొర్ర. కిషన్ నాయక్



దేవరకొండ సెప్టెంబర్ 2 (మహాప్రభ)

సమాచార హక్కు చట్టం పట్ల పిఐఓల నిర్లక్ష్యం. సహ చట్టం గురించి పిఐఓలకు తెలుసా..? సమాచార హక్కు చట్టం పట్ల పలువురు పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్స్ (పిఐఓలు) నిర్లక్ష్యం వహిస్తూ సహ చట్టాన్ని నిరుగారుస్తున్నారు. అసలు సమాచార హక్కు చట్టం పట్ల ఏమాత్రం అవగాహన లేనివారు సైతం పిఐఓలుగా విధులు నిర్వహించడం మూలంగా వారికి సహ చట్టం అంటే ఏమిటో, సహ చట్టం కింద దరఖాస్తులకు సమాధానం ఎలా ఇవ్వాలి, ఎన్ని రోజుల్లో సమాచారం ఇవ్వాలి అనే ప్రాథమిక సమాచారం కూడా తెలియని వాళ్లు సహ చట్టం పిఐఓలు. అసలు సహ చట్టం అంటే ఏమిటి? సహ చట్టాన్ని ఎలా ఉపయోగించుకోవాలి? అనే విషయాలు స్పష్టంగా తెలుసుకుందాం రండి.

సమాచార హక్కు చట్టం గురించి ప్రజలు తెలుసుకోండి. సమాచార హక్కు చట్టం ప్రతి పౌరుడు తెలుసుకోవాల్సిన సహ చట్టం సెక్షన్లు. సమాచార హక్కు గురించి మీకు పూర్తిగా తెలుసా..? సమాచారం ఇవ్వకపోతే ఆ ప్రజా సమాచార అధికారి ఐపిసి సెక్షన్లు 166, 167, 217, 218, 219, 220, 420, 406, 407, మరియు 408 నేరపరిధిలోకి వస్తారు. కాబట్టి సహ చట్టం కింద దరఖాస్తు దారులు కోరిన సమాచారాన్ని ఇవ్వవలసిందిగా విజ్ఞప్తి. లేని పక్షంలో సమాచార నిబంధనలు ఉల్లంఘించినందుకు చట్టాన్ని దుర్వినియోగం చేసినందుకు గాను పై సెక్షన్ల ప్రకారం కేంద్ర, రాష్ట్ర కమీషనర్లు కూడా సమాచారం ఇవ్వని వారిని జైలుకు పంపవచ్చని చట్టంలో పేర్కొనబడింది. ఒకవేళ పూర్తి అవగాహన లేకపోతే క్రింది వివరాలు చూడండి.

"సమాచార హక్కు ప్రతి దరఖాస్తుదారుడు ... వినియోగదారే" 30 రోజుల్లో సమాచారం ఇవ్వకపోతే వినియోగదారుల ఫోరమ్ వెళ్ళవచ్చు.

సమాచారాన్ని దరఖాస్తు ఫారం లేదు. కావలసిన సమాచారం తెల్లకాగితంపై రాసి పిఐఓ (ప్రజా సమాచార అధికారి) కి అడగవచ్చు. అధికారికి డైరెక్ట్ గా గాని రిజిస్టర్ పోస్టు ద్వారా అయినా పంపి అడగవచ్చు. దరఖాస్తు దారునికి వయస్సు, స్థానికత అవసరం లేదు.

సెక్షన్ 2 (ఎఫ్) ప్రకారం: సమాచార నిర్వచనం. (కార్యాలయాల్లో రికార్డులు, పత్రాలు, మెమోలు, ఈ-మెయిల్స్, అభిప్రాయాలు, పుస్తకాలు, ప్రకటనలు, సీడీలు, డివిడీలు, మొదలైనవి).

సెక్షన్ 2 (హెచ్) ప్రకారం: సమాచార చట్ట పరిధిలోకి వచ్చే కార్యాలయాలు ((ప్రభుత్వంచే గుర్తింపు పొందిన, స్వచ్ఛంద సంస్థలు).

సెక్షన్ 2(ఐ) ప్రకారం: రికార్డు నిర్వచనం.

సెక్షన్ 2(జె) ప్రకారం: ప్రభుత్వం చేపట్టే అన్ని కార్యక్రమాలు పరిశీలించవచ్చు. ఏ ప్రభుత్వ కార్యాలయంలో రికార్డులనైనా దరఖాస్తు చేసుకుని తనిఖీ చేయవచ్చు. అవసరం అయితే జిరాక్స్ చేసుకోవచ్చు.

సెక్షన్ 2(జె)(అ) ప్రకారం: పనులను, పత్రాలను తనిఖీ చేసే హక్కు (ఒక గంటకు రూ. 5/-).

సెక్షన్ 3 ప్రకారం: వెల్లడించవలసిన సమాచారం ఎవరూ అడగక ముందే ఆ సమాచారాన్ని అందుబాటులో ఉంచాలి.

సెక్షన్ 4(1)(ఎ), (బి) ప్రకారం: నిర్ణయాలు వాటికి గల కారణాలు చెప్పక్కరలేదు (సమాచారం ఎందుకు అని చెప్పక్కరలేదు).

సెక్షన్ 4(2) ప్రకారం: వీలైనంత ఎక్కువగా స్వచ్ఛందంగా ఇవ్వవలసిన సమాచారం.

సెక్షన్ 4(4) ప్రకారం: స్థానిక భాషలో ఇవ్వాలి.

సెక్షన్ 5(1), (2) ప్రకారం: ప్రజా సమాచార అధికారులు (పిఐఓ) / అప్పీలేట్ అధికారుల నియామకం.

సెక్షన్ 6(1) ప్రకారం: సమాచార హక్కు దాఖలు విధానం.

సెక్షన్ 6(2) ప్రకారం: సమాచారం ఎందుకో చెప్పనక్కర్లేదు.

సెక్షన్ 6(3) ప్రకారం: కోరిన సమాచారం సంబంధిత శాఖ అధికారికి దరఖాస్తు బదిలీ (సమాచారం మరో కార్యాలయానికి పంపవలసిన బాధ్యత అధికారులదే).

సెక్షన్ 7(1) ప్రకారం: 30 రోజులలోపు సమాచారం ఇవ్వవలసిందే... వ్యక్తి జీవితానికి, స్వేచ్ఛకు సంబంధించింది అయితే 48 గంటల లోపే ఇవ్వాలి.

సెక్షన్ 7(3)(బి) ప్రకారం: సమాచార రుసుము (కోర్టు సంబంధించని మాత్రం రూ. 25/-. మిగతా శాఖ వారికి రూ. 10/- మాత్రమే చెల్లించాలి). ఏ రూపంలో వేయాలి?

బ్యాంకర్స్ చెక్కు రూపంలో మాత్రమే దరఖాస్తు రుసుము అకౌంట్ అధికారి పేరిట పంపించాలి.

విలయసంతంత (చిరునామా) పోస్టల్ ఆర్డరు మాత్రమే రుసుముగా చెల్లించాలి. (ప్రతి పేజీకి ఎ-4, ఎ-3 రూ. 2/- చొప్పున, సీడీకి రూ. 100/- చొప్పున, ఫ్లాపీకి రూ. 50/- చొప్పున, డివిడీ రూ. 200/- చెల్లించాలి. కోర్టు లో ప్రతి పేజీకి రూ. 5/- చొప్పున చెల్లించాలి).

సెక్షన్ 7(1) ప్రకారం: దరఖాస్తు గడువు 30 రోజులు.

సెక్షన్ 7(6) ప్రకారం: గడువులోపు సమాచారం ఇవ్వకుంటే సమాచారం ఉచితంగా ఇవ్వాలి.

సెక్షన్ 8(1) ప్రకారం: సమాచారం మినహాయింపులు (దేశరక్షణ సంబంధించి ఒప్పందాలు).

సెక్షన్ 8(2) ప్రకారం: అడిగిన సమాచారంలో ప్రజాప్రయోజనం ఉంటే మినహాయింపులు వర్తించవు.

సెక్షన్ 18(1) ప్రకారం: కమీషన్ కు ఫిర్యాదు, విదివిదనాలు

18(3)- ఫిర్యాదు విచారణ సందర్భంలో కమిషన్ల అధికారాలు

సెక్షన్ 19(1) ప్రకారం: మొదటి అప్పీలు.

సెక్షన్ 19(3) ప్రకారం: రెండవ అప్పీలు 90 రోజుల లోగా రాష్ట్ర, కేంద్ర సమాచార కమీషన్ కి అప్పీల్ చేసుకోవాలి. సరైన కారణాలు ఉంటే 90 రోజుల తరువాత అప్పీల్ చేసుకోవచ్చు.

సెక్షన్ 19(1) కమీషన్ల నిర్ణయాలు: సెక్షన్ 19(8)(ఎ)(బి) ప్రకారం దరఖాస్తుదారు తనకు కలిగిన ఆర్థికపరమైన కష్టనష్టాలపై కమీషన్ ఆధారాలు సమర్పించాలి. సక్రమంగా ఉంటే నష్టపరిహారం మంజూరు చేయాలి.

సెక్షన్ 20(1) ప్రకారం: సమాచారం ఇవ్వకపోతే (తప్పుడు సమాచారం ఇస్తే) రోజుకు రూ. 250 చొప్పున వరకు రూ. 25,000 జరిమానా.

సెక్షన్ 20(2) ప్రకారం: క్రమశిక్షణ చర్యలకు సిఫారసు.

గడువులోగా సమాచారం ఇవ్వకపోతే వినియోగదారుల ఫోరమ్ కు వెళ్లవచ్చు. బిసిడబ్ల్యూ తప్పుడు సమాచారం ఇస్తే రాష్ట్ర కమీషనర్ లేకుంటే డైరెక్ట్ గా న్యాయస్థానానికి వెళ్లవచ్చు. రెండవ షెడ్యూల్ లోని నిఘా భద్రతా సంస్థల్లో సెక్షన్ 24(1) అవినీతి, మానవ హక్కుల ఉల్లంఘన ఆరోపణలకు సంబంధించిన సమాచారాన్ని మాత్రం తీసుకోవచ్చు. ప్రతి పౌరుడు విరివిగా సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారాన్ని అడగండి. సమాచారం అడగడం మన హక్కు. అడిగిన సమాచారం ఇవ్వడం అధికారుల బాధ్యత. సమాచారం ఎందుకు, ఎక్కడ, ఏమిటి అని అడిగే హక్కు అధికారులకు లేదు. సహ చట్టం సెక్షన్ 26 ప్రకారం సహా చట్టాన్ని ప్రచారంలో ప్రభుత్వం కమిషన్ల బాధ్యతలు సహ చట్టం కింద సమాచారం అడిగిన వారికి సంబంధించిన అధికారి సమాచారం ఇచ్చి తీరాల్సిందే అర్టీఐఎఎస్ రాష్ట్ర అధ్యక్షులు అన్నారు.

వైఎస్సార్ ఆశయాలను నెరవేరుస్తాం

మొదటి తరువాయి



ఈ అవార్డును అందజేశారు. బతికున్నంతకాలం రైతుల సంక్షేమం కోసం పరితపించిన డాక్టర్ వైఎస్సార్‌ను గుర్తుచేసుకునేలా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు నిర్వాహకులను సీఎం అభినందించారు. నిరుపేదలు, రైతుల కష్టాలను తెలుసుకునేందుకు 2003లో మండుటెండలో డాక్టర్ వైఎస్సార్ చేపట్టిన ప్రజాప్రస్థానం పాదయాత్రను ఆయన గుర్తుచేశారు. రైతుల ఆత్మగౌరవాన్ని పెంచేందుకు ఉచిత విద్యుత్ అందించాలని వైఎస్సార్ నిర్ణయించారని తెలిపారు.అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు ఉచిత విద్యుత్ అందించే ఫైలుపై తొలి సంతకం చేసిన గొప్ప నాయకుడు వైఎస్సార్ అని సీఎం పేర్కొన్నారు. రూ.1,300 కోట్ల విద్యుత్ బకాయిలను రద్దు చేయడంతో పాటు రైతులపై నమోదైన కేసులను ఎత్తివేసిన ఘనత ఆయనకే దక్కుతుందని అన్నారు. ఈ నిర్ణయాలతో వైఎస్సార్ రైతుల గుండెల్లో రారాజుగా నిలిచిపోయారని పేర్కొన్నారు. వైఎస్సార్ చివరి కోరికలను నెరవేర్చేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామీణ నిరుపేదలకు కనీస ఆహార భద్రత కల్పించాలనే సంకల్పంతో అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ ప్రజా పంపిణీ వ్యవస్థను తీసుకొచ్చారని రేవంత్‌రెడ్డి తెలిపారు. పేదలకు బియ్యం, గోధుమలు, ఇతర నిత్యావసర వస్తువులను అందించే విధంగా ప్రారంభమైన పీడీఎస్ వ్యవస్థ వల్లే నేడు తెలంగాణలో పెద్ద ఎత్తున ఆహార భద్రత కార్యక్రమాలను అమలు చేయగలుగుతున్నామని వివరించారు. తెలంగాణలో ప్రస్తుతం 3.40 కోట్ల మందికి ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున ఉచితంగా సన్నబియ్యం అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ వెంకటస్వామి, ఎంపీ జైరాం రమేష్, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌గౌడ్, కేవీపీ ఫౌండేషన్ అధ్యక్షుడు కేవీపీ రామచందర్‌రావుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఊబర్‌లో 3,300 ఉద్యోగాల కోత..

-రోబోటాక్సీల పోటీ నేపథ్యంలో భారీగా సిబ్బంది తగ్గింపు
-10 శాతం ఉద్యోగులను తొలగించనున్న ఊబర్
-కొవిడ్ తర్వాత ఇదే అతిపెద్ద ఉద్యోగాల కోత
-మేనేజ్‌మెంట్ స్థాయిలను సరళీకరించేందుకు నిర్ణయం
-సంస్థాగత సంక్లిష్టతను తగ్గించడమే లక్ష్యమన్న సీఈవో
-భవిష్యత్ వృద్ధి, ఆవిష్కరణలకు పాదుపు వినియోగం



న్యూఢిల్లీ

రైడ్ హైలింగ్ వ్యాపారంలోకి రోబోటాక్సీల ప్రవేశాన్ని ఎదుర్కొనేందుకు, కొవిడ్-19 మహమ్మారి తర్వాత తన అతి పెద్ద కోతలలో భాగంగా ఊబర్ టెక్నాలజీస్ దాదాపు 3,300 మంది ఉద్యోగులను అంటే 10 శాతం సిబ్బందిని తొలగించనుంది. ఈ కోతల ద్వారా మేనేజ్‌మెంట్ స్థాయిలు సులభతరం అవుతాయని, వేగవంతమైన వృద్ధి సమయంలో నిర్ణయాలు తీసుకోవడంలో సంస్థాగత సంక్లిష్టతను తగ్గిస్తాయని సంస్థ సీఈవో ఖోస్రోషాహి బుధవారం ఉద్యోగులకు రాసిన నోట్‌లో తెలిపారు. కాగా పలు టెక్ ఎగ్జిక్యూటివ్‌ల మాదిరిగా ఖోస్రోషాహి ఈ ఉద్యోగ కోతలకు ఏఐ కారణమని చెప్పలేదు. ఈ నిర్ణయం భవిష్యత్తులో కీలక వృద్ధికి, నూతన ఆవిష్కరణలకు, తిరిగి పెట్టుబడులు పెట్టడానికి అవసరమయ్యే పొదుపును సృష్టిస్తుందని అన్నారు. అమెరికాలో అదిపెద్ద రోబో టాక్సీ ఆపరేటర్ వేమోతో ఊబర్‌కు పోటీ పెరుగుతున్నందున ఊబర్ ఈ నిర్ణయం తీసుకున్నదనే వార్త వినిపిస్తోంది.

కాంగ్రెస్‌ను కొందరు కబ్జా చేయాలని చూస్తున్నారు

మొదటి తరువాయి

వైఎస్సార్ స్ఫూర్తితోనే తాను రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. రాజకీయాల్లో ఉన్నంత కాలం ఆయన ఆశయాల సాధన కోసం పనిచేస్తానని, వైఎస్సార్‌ను ఎప్పటికీ మరచిపోబోనని అన్నారు. ఎంతమంది కుట్రలు చేసినా, బెదిరింపులకు పాల్పడినా తాను భయపడేది లేదన్నారు. ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్‌ను నమ్ముకున్న నిజమైన కార్యకర్తలకు అన్యాయం జరగకుండా చూస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు పెద్ద ఎత్తున 'సీఎం.. సీఎం' అంటూ నినాదాలు చేశారు. దీనిపై స్పందించిన రాజ్‌గోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. 'నన్ను సీఎం.. సీఎం అని పిలుస్తున్నారు. ఆ సమయం గనక వస్తే.. దాన్ని బ్రహ్మదేవుడు కూడా ఆపలేడు' అని అన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను మరోసారి అధికారంలోకి తీసుకొచ్చి 'రాజన్న రాజ్యం' కొనసాగిస్తామని రాజ్‌గోపాల్ రెడ్డి పేర్కొన్నారు.

కేసీఆర్ రాజీనామా చేస్తే
సోనియానే వణికింది..

మొదటి తరువాయి



చేస్తే సోనియా గాంధీనే తట్టుకోలేకపోయింది. నీ నుంచి అయితదా రేవంత్ అని సూటిగా ప్రశ్నించారు. కేసీఆర్ రాజీనామాతోనే రాష్ట్రం వచ్చింది. పనికి మాలిన మాటలు మాటలు మాని పనికొచ్చే పని చేయాలని హితవు పలికారు

దానం కాదు.. పరిహారం కావాలి

-భారత్, చైనా, అమెరికాతో మాకు ముప్పు
-కాలుష్యాన్ని విపరీతంగా వెదజల్లుతున్నాయి
-ఇటీవలి వరదలకు కారణమయ్యాయి
-ఆ మూడు దేశాలు నష్ట పరిహారం చెల్లించాలి
- నేపాల్ విదేశాంగ మంత్రి డిమాండ్
- ఐరాసను ఆశ్రయించే దిశగా నేపాల్ పీఎం
- 1,127కు చేరుకున్న మృతుల సంఖ్య
- మూడు నదుల ఉగ్రరూపంతో వరద ముప్పు



ఖాట్మండ్:

వరద నష్టాలకు పరిహారం చెల్లించాలని చైనా, అమెరికా, భారత్ దేశాలను నేపాల్ డిమాండ్ చేసింది. ప్రపంచంలో పెద్ద మొత్తంలో కాలుష్యాన్ని వెదజల్లే దేశాల్లో ఆ మూడు దేశాలు ముందు వరుసలో నిలిచాయని ఆరోపించింది. భోట్కోసీ నదీ ప్రాంతంలో ఇటీవల చోటుచేసుకున్న ప్రాణాంతక వరదలకు వాతావరణ నష్టపరిహారం కోరింది. ఈ వరదల్లో కనీసం 1,127 మంది మరణించారు. వేలాదిమంది గల్లంతయ్యారు. నేపాల్-చైనా సరిహద్దు దగ్గర భారీ రాత్రి, మంచు కొండచరియలు విరిగిపడటంతో వరదలు వచ్చినట్లు వార్తలు వచ్చాయి. మూడు నదుల్లో నీటి మట్టం ప్రమాదకర స్థాయిని దాటడంతో నేపాల్‌కు వరదముప్పు పొంచి ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో నష్టపరిహారం రాబట్టే విషయంలో ఖాట్మండు గట్టి పట్టుదలతో ఉందని వెల్లడించాయి. నష్టపరిహారం కోసం ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశానికి ప్రధానమంత్రి బలేంద్ర బాలెన్ షా వెళ్లే అవకాశం ఉంది. ఆయన వ్యక్తిగతంగా రసువా వరదలను హైలైట్ చేసి వాతావరణ న్యాయం, నష్టపరిహారం కోరే ప్రతిపాదన ప్రస్తుతం చర్చలో ఉంది. నేపాల్ విదేశాంగ మంత్రి శిశిర్ ఖానాల్ ప్రకారం దేశం సహాయం నుంచి న్యాయం, నష్టపరిహారం వైపు దౌత్య విధానాన్ని మార్చుకుంటోంది. ఇది దానం కాదు, చట్టపరమైన, నైతిక బాధ్యత. ప్రపంచంలో అత్యధిక ఉద్గారాలు విడుదల చేసే దేశాల్లో చైనా మొదటి స్థానంలో, అమెరికా రెండో స్థానంలో, భారత్ మూడో స్థానంలో ఉన్నాయి. నేపాల్ లాంటి హాని కలిగే దేశాలకు నష్టపరిహారం ఇవ్వాల్సిన చారిత్రక బాధ్యత ఈ దేశాలకు ఉందని శిశిర్ ఖానాల్ అన్నారు. ఐక్యరాజ్యసమితి నష్టం, నష్టపరిహార నిధిని కూడా నేపాల్ ఆశ్రయించింది. పునర్నిర్మాణానికి నాలుగు నుంచి ఐదు బిలియన్ డాలర్లు అవసరమవుతాయని అంచనా. సకాలంలో సహాయం పంపినందుకు భారత్, చైనా దేశాలకు ప్రధానమంత్రి బాలెన్ షా కృతజ్ఞతలు తెలిపారు. అయినప్పటికీ వాతావరణ నష్టపరిహారం కోసం అంతర్జాతీయ వేదికలపై పట్టుదలతో వాదిస్తామని విదేశాంగ మంత్రి శిశిర్ ఖానాల్ స్పష్టం చేశారు. హిమాలయ హిమానీనదాలు కరిగిపోతే గంగ, త్రిశూలి వంటి నదులపై ఆధారపడిన 200 కోట్లకు పైగా దక్షిణాసియా ప్రజల నీటి భద్రత శాశ్వతంగా దెబ్బతింటుందని హెచ్చరించారు.

మళ్లీ వార్ సెగలు

- భగ్గుమన్న పశ్చిమాసియా
- టెహ్రాన్‌లోని సైనిక స్థావరాలపై అమెరికా దాడులు
- ప్రతీకారేచ్ఛతో రగిలిన ఇరాన్..
- జోర్డాన్, బహ్రెయిన్, ఇరాక్, కువైట్‌లోని యూఎస్ లక్ష్యాలపై ఎటాక్
-హోర్ముజ్‌ను ట్రంప్ జలసంధిగా మార్చాలా?
- ప్రజల్ని ప్రశ్నిస్తూ ట్రూత్ సోషల్‌లో ట్రంప్ పోస్ట్



వాషింగ్టన్

పశ్చిమాసియా మళ్లీ భగ్గుమంది. అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. మొన్నటి వరకు తగ్గుముఖం పట్టిన ఘర్షణలు మళ్లీ ఉధృతమయ్యాయి. ఇరాన్‌లోని ఇస్లామిక్ రివాల్యూషనరీ గార్డ్ కోర్స్ స్థావరాలు, వైమానిక రక్షణ వ్యవస్థలు, రాడార్ కేంద్రాలు, కమ్యూనికేషన్ మౌలిక వసతులు, సముద్ర సామర్థ్యాలను లక్ష్యంగా చేసుకుని అమెరికా సేనలు భారీ దాడులు జరిపింది. కాగా, ప్రతిగా ఇరాన్ క్షిపణులు, డ్రోన్లతో అమెరికా సైనిక లక్ష్యాలపైకి విరుచుకుపడింది. జోర్డాన్, బహ్రెయిన్, ఇరాక్, కువైట్ ప్రాంతాల్లోని అమెరికా సైనిక స్థావరాలు, అమెరికా ప్రయోజనాలకు సంబంధించిన ప్రాంతాలను ఇరాన్ లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో 11 మంది మృతిచెందినట్లు సమాచారం. ఈ దాడులు జులై తర్వాత ఇరుదేశాల మధ్య జరిగిన అత్యంత తీవ్రమైన ప్రత్యక్ష సైనిక ఘర్షణగా మారాయి. ప్రస్తుత ఘర్షణకు హోర్ముజ్ జలసంధి కీలక కేంద్రంగా మారింది. ప్రపంచ చమురు రవాణాలో అత్యంత వ్యూహాత్మకమైన ఈ మార్గంలో ఇరాన్ మైన్లను ఏర్పాటు చేయడానికి, వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకోవడానికి ప్రయత్నించిందని అమెరికా ఆరోపిస్తోంది. దీనికి ప్రతిస్పందనగా అమెరికా ఇరాన్‌కు చెందిన సముద్ర వనరులు, ఆయిల్ ట్యాంకర్లపై కూడా దాడులు చేసినట్లు తాజా నివేదికలు చెబుతున్నాయి.

ఇరాన్‌లోని సిరిక్ ప్రాంతం సమీపంలో జరిగిన అమెరికా దాడిలో ఓ వివాహ వేడుకకు సంబంధించిన ప్రాంతం దెబ్బతిని పలువురు పౌరులు మరణించినట్లు ఇరాన్ వర్గాలు చెబుతున్నాయి. చిన్నారితో సహా పౌరులు మృతి చెందినట్లు స్థానిక నివేదికలు పేర్కొంటున్నాయి. అయితే అమెరికా మాత్రం పౌరులను లక్ష్యంగా చేసుకుని దాడులు చేయలేదని స్పష్టం చేసింది. పెల్లింటిపై అమెరికా చేసిన బాంబు దాడులకు ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ ప్రతిజ్ఞ పూనింది.

ట్రంప్ జలసంధిగా మార్చేద్దామా?

హోర్ముజ్ జలసంధిపై అమెరికాకు దాదాపు పూర్తి నియంత్రణ ఉందని, ఇరాన్ చర్యలను తిరస్కరిస్తూ, టెహ్రాన్‌కు వ్యతిరేకంగా తిరగబడాలని ట్రంప్ పిలుపునిచ్చారు. ఈ వ్యూహాత్మక జలమార్గం అమెరికా సైనిక నియంత్రణలో ఉన్నందున, హోర్ముజ్ జలసంధికి ట్రంప్ జలసంధిగా పేరు మార్చాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సూచించారు. ఇప్పుడు ఇది అమెరికా నియంత్రణలోకి వచ్చింది కాబట్టి, మనం హోర్ముజ్ జలసంధి పేరును ట్రంప్ జలసంధిగా మార్చాలా??? అమెరికాలాగే, ఇది కూడా మునుపెన్నడూ లేనంత వేడిగా మారుతుంది! అని ట్రూత్ సోషల్‌లో ఒక పోస్ట్‌లో ట్రంప్ రాశారు.

బీసీ మహిళ కాబట్టే కుట్రలు

మొదటి తరువాయి

వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను కూడా కలిసి విషయాలన్నీ వివరించినట్లు సురేఖ తెలిపారు. కేసీ వేణుగోపాల్‌ను కలవాలని ప్రయత్నించినప్పటికీ ఆయన బిజీగా ఉండటంతో భేటీ కాలేకపోయానని, తాను ఖర్గేను కలిసి కిందకు వచ్చేలోపి ఆయన వెళ్ళిపోయారని చెప్పారు. ఈ విషయంపై ఖర్గే సానుకూలంగా స్పందించారని తెలిపారు. చూద్దాం అన్నారని, పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారని సురేఖ వెల్లడించారు. తన కుమార్తె వివాహం జరిగి ఇండిపెండెంట్‌గా జీవిస్తున్న వ్యక్తి అని, ఆమె తన అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసే హక్కు కలిగి ఉందని, ఆమె మాట్లాడిన దానికి నాకు షోకాజ్ ఇవ్వడం బాధ కలిగించిందని చెప్పారు. బీసీ మహిళగా తాను తన వాదనను అధిష్టానం ముందు చెప్పుకున్నానన్నారు.

తెలంగాణలో బీసీల రాజకీయ ప్రాధాన్యతను కూడా ఆమె ప్రస్తావించారు. తాను మంత్రిగా సమర్థంగా పనిచేస్తున్నానని, తనపై ఎలాంటి అవినీతి ఆరోపణలు లేవని, తనకు అప్పగించిన శాఖలను సమర్థంగా నిర్వహిస్తూ ప్రజలకు సేవ చేస్తున్నానని మంత్రి సురేఖ చెప్పారు. అందువల్ల తనను మంత్రి పదవిలో కొనసాగించాలని ఖర్గే, మీనాక్షినటరాజన్‌ను కోరినట్లు వెల్లడించారు. మరోవైపు తనపై ఫిర్యాదులు చేసిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పీసీసీ తనపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఫారసు చేసిన అంశంపై స్పందిస్తూ.. తనకు షోకాజ్ ఇవ్వడమే తప్పని, ఫిర్యాదుల ఆధారంగా పీసీసీ ఆ విధంగా సిఫారసు చేసిందని వ్యాఖ్యానించారు.

పార్టీ తననేమీ అడగలేదని, వాళ్లు అడిగినప్పుడు, ఆ సమయంలో పరిస్థితిని బట్టి తన నిర్ణయం ఉంటుంది అని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నేరుగా టికెట్లు ఇస్తానని ప్రకటిస్తున్న అంశంపై ప్రశ్నించగా.. అది పార్టీ అంతర్గత వ్యవహారమని, దానిపై తాను వ్యాఖ్యానించబోనని చెప్పారు.

4న జీఎస్ఎల్వీ-ఎఫ్17
రాకెట్ ప్రయోగం

-తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఇస్రో చైర్మన్ వి.నారాయణన్
-ఈఓఎస్-05 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్న ఇస్రో
-జీఎస్ఎల్వీ సిరీస్‌లో ఇది 19వ ప్రయోగం
-సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ రెండో లాంచ్ ప్యాడ్ నుంచి ప్రయోగం
-జియో ప్లాట్‌ఫామ్‌పై ప్రయోగిస్తున్న తొలి భారతీయ ఉపగ్రహం ఈఓఎస్-05
-భూమి పరిశీలనకు ఉపగ్రహం ద్వారా కీలక చిత్రాల సేకరణ
ప్రయోగం విజయవంతం కావాలని శ్రీవారిని దర్శించుకున్న ఇస్రో చైర్మన్



తిరుమల

సెప్టెంబర్ 4వ తేదీన జీఎస్ఎల్వీ-ఎఫ్17 రాకెట్‌ను ప్రయోగించనున్నారు. ఈ నేపథ్యంలో ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ ఇవాళ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. జీఎస్ఎల్వీ కేటగిరీలో ఇది 19వ రాకెట్ కావడం విశేషం. ఈ రాకెట్ ద్వారా నింగిలోకి ఈఓఎస్-05 ఉపగ్రహాన్ని తీసుకెళ్లనున్నారు. జియో ప్లాట్‌ఫామ్‌పై ప్రయోగిస్తున్న తొలి భారతీయ ఉపగ్రహం ఈఓఎస్-05 అని నారాయణన్ తెలిపారు.సబ్-జీటీవో కక్ష్యలోకి ఈఓఎస్-05 శాటిలైట్‌ను ప్రవేశపెట్టనున్నారు. సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్‌లోని రెండో లాంచ్ ప్యాడ్ నుంచి జీఎస్ఎల్వీ-ఎఫ్17ను ప్రయోగించనున్నారు. దీని పేలోడ్ ఫేరింగ్ 4 మీ డయామీటర్లు ఓగీవ్‌గా పేర్కొన్నారు. ఈఓఎస్-05 అనేది ఎర్త్ అబ్జర్వేషన్ స్పేస్‌క్రాఫ్ట్. దీని ద్వారా భూమిను పరిశీలించనున్నారు. జియోసింక్రోనస్ ఆర్బిట్ నుంచి ఈ శాటిలైట్ ఇమేజ్‌లను తీస్తుంటుంది.

రామ మందిరం తొలి సీఈవోగా జితేంద్ర మిశ్రా

అయోధ్య, సెప్టెంబర్ 2

అయోధ్య రామ మందిరం తొలి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(సీఈవో)గా మాజీ ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా నియామకాన్ని శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ బుధవారం ఆమోదించింది. దేవరియాకు చెందిన మిశ్రా ఆపరేషన్ సిందూర్ సమయంలో వెస్టర్న్ ఎయిర్ కమాండ్ అధిపతిగా ఉన్నారు. రామ మందిరంలో విరాళాల చోరీ జరిగినట్టు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ తన మూడవ సమావేశాన్ని బుధవారం నిర్వహించింది. ఈ సందర్భంగా ముగ్గురు కొత్త ట్రస్టీలను ట్రస్ట్ ప్రకటించింది. వీరిలో ఒక మహిళ కూడా ఉన్నారు.ఢిల్లీకి చెందిన మహేష్ భాగ్‌చంద్కా, అయోధ్య న్యాయవాది మదన్ మోహన్ పాండే,



ఆర్ఎస్ఎస్‌తో సంబంధం ఉన్న షికోహాబాద్‌కు చెందిన నిర్మలా యాదవ్ ట్రస్టీలుగా నియమితులయ్యారు. విశ్వ హిందూ పరిషద్(వీహెచ్‌పీ) మాజీ అధ్యక్షుడు అశోక్ సింఘాల్‌కు బంధువైన మహేష్ భాగ్‌చంద్కా 2020లో రామ మందిర భూమిపూజ సందర్భంగా నిర్వహించిన ధార్మిక కార్యక్రమంలో ఆయన ప్రధాన యజమానిగా వ్యవహరించారు. 2024 జనవరి 22న రామ మందిరంలో ప్రాణ ప్రతిష్ట కార్యక్రమంలో కూడా ఆయన యజమానిగా వ్యవహరించారు. దేశ ప్రజలకు సేవ చేసే అవకాశం తనకు ఈ కొత్త బాధ్యతను స్వీకరించేలా ప్రేరణ ఇచ్చిందని జితేంద్ర మిశ్రా(రిటైర్డ్) అన్నారు.

శ్రీ అంకాలమ్మ తల్లి జాతర మరియు కంఠా మహేశ్వర స్వామి కళ్యాణ.

-మహోత్సవం పాల్గొన్న బి ఆర్ ఎస్ నాయకులు వడ్డ రమేష్ .



దేవరకొండ డివిజన్ సెప్టెంబర్ 2 (మహా ప్రభ)
దేవరకొండ నల్గొండ జిల్లా చందంపేట మండలం చిత్రియాలు గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహించిన శ్రీ అంకాలమ్మ తల్లి జాతర మరియు కంఠా మహేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించిన బిఆర్ఎస్ దేవరకొండ నియోజకవర్గం నాయకులు వడ్డ రమేష్ అనంతరం వారిని శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్. పార్టీ చిత్రియాల సర్పంచ్ చాట్ల చిరంజీవి ,మాజీ జడ్పీటీసీ బోయపల్లి శ్రీనివాస్, బోయపల్లి రాములు బి ఆర్ ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు రామ లింగం ,పవన్, శ్రీశైలం, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘం 36 జాతీయ మహాసభలను జయప్రదం చేయండి.

- సీఐ టీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు చిన్నపాక లక్ష్మీనారాయణ.



దేవరకొండ డివిజన్ సెప్టెంబర్ 2 (మహాప్రభ)
దేవరకొండ నల్గొండ జిల్లా పీఏ పల్లి మండ ల పరిధిలో నల్లగొండలో జరిగే అఖిల భారత కిసాన్ సభ (ఏఐ కేఎస్) నవంబర్ 15 నుండి 18 వరకు 36వ రైతు జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు చినపాక లక్ష్మీనారాయణ కంబాలపల్లి ఆనంద్ పిలుపునిచ్చారు.బుధవారం రైతు సంఘం జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని పిఏ పల్లి మండలం పావురాల గట్టు గ్రామంలో ఇంటింటికి కరపత్ర ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి లు గా హాజరైన లక్ష్మీనారాయణ ఆనంద్ లు మాట్లాడుతూ నాటి బ్రిటిష్ సామ్రాజవాదం, వలస వాదానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో 1936లో అఖిల భారత కిసాన్ సభ ఆవిరిభవించి నేటికి 90 సంవత్సరాలు అవుతుందని అన్నారు. నాటినుండి నేటి వరకు రైతాంగ సమస్యల పైన వ్యవసాయ రంగ రక్షణ కోసం సమరశీల పోరాటాలు నిర్వహించిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీడు భూములకు సాగునీరు అందించే ప్రాజెక్టుల కోసం పోడు భూముల పట్టాల కోసం కౌలు రైతులకు న్యాయం చేయాలని పంట రుణాలు నాణ్యమైన ఎరువులు విత్తనాల సరఫరా రుణమాఫీ కోసం అనేక ఉద్యమాలు చేసిన చరిత్ర ఉందని అన్నారు.పెండింగ్ ప్రాజెక్టుల సాధన కోసం ఉమ్మడి రాష్ట్రంలో ఇప్పుడు తెలంగాణలో పోరాడిన ఏకైక సంఘం రైతు సంఘం అని అన్నారు. వ్యవసాయ రంగం తీవ్రమైన సంక్షేమంలోకి నెట్టబడుతున్న ప్రభుత్వ విధానాలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ పోరాడుతుంది. ఎస్ ఎల్ బి సి సొరంగ మార్గం డిండి ఎత్తిపోతల పథకం డిస్ట్రిబ్యూటరీల ఆధునికరణ కోసం మరిన్ని రైతు ఉద్యమాలు నిర్మించడం కోసం దేశంలో రైతుల సమస్యలపై ఉద్యమాల రూపకల్పన కోసం జరుగుతున్న ఈ మహాసభలకు ప్రజలంతా సహకరించి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కావలి కృష్ణయ్య, చంద్రు నాయక్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు లక్ష్మయ్య గిరిజన సంఘం నాయకులు మోతిలాల్ హరి లక్య సుభాష్ తదితరులు పాల్గొన్నారు

ఘనంగా డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వేడుకలు



దేవరకద్ర: సెప్టెంబర్ 2 (మహాప్రభ
దేవరకద్ర మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి, కీర్తిశేషులు డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను స్మరించుకుంటూ నాయకులు, ప్రజాప్రతినిధులు నివాళులర్పించారు. దేవరకద్ర మున్సిపల్ చైర్మన్ దమయంతి గోవర్ధన్ రెడ్డి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి దేవరకద్ర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బూనేటి అంజన్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని కొనియాడారు. పేదలు, రైతులు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి ఎప్పటికీ స్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొని డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డికి ఘనంగా నివాళులర్పించారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలి...



మందమర్రి, సెప్టెంబర్ 2 మహాప్రభ
ఎన్నికల అప్పుడు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని బిఆర్ఎస్ నాయకులు సూరిబాబు, మేడిపల్లి సంపత్ డిమాండ్ చేశారు. బుధవారం వారు మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయాలని పేర్కొన్నారు. పెన్షన్లను పెంచాలని అదేవిధంగా మహిళలకు ఇస్తామన్న ఆర్థిక సహాయాన్ని కూడా అందజేయాలని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడుస్తున్నప్పటికీ అభివృద్ధి శూన్యమని పేర్కొన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్,టీబీజీకేఎస్, మహిళలు, తదితరులు,పాల్గొన్నారు.

దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి





-సందర్భంగా నివాకులర్పించిన ఎమ్మెల్యే బాలు నాయక్

దేవరకొండ సెప్టెంబర్ 2(మహాప్రభ)
పేదలు, రైతులు, మహిళలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి జీవితాంతం కృషి చేసిన దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి "డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి" సందర్భంగా దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ తన నివాసంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ.. వైఎస్సార్ పేరు చెబితే పేద ప్రజల సంక్షేమం, రైతుల అభివృద్ధి, ఆరోగ్యం, విద్య, సామాజిక న్యాయం గుర్తుకు వస్తాయని అన్నారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపే అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసి, ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న నాయకుడు వైఎస్సార్ అని కొనియాడారు.
"వైఎస్సార్ భౌతికంగా మన మధ్య లేకపోయినా.. ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, పేదల కోసం చేసిన సేవలు ప్రజల గుండెల్లో ఆయనను చిరస్థాయిగా నిలిపాయి. పేదవాడి కన్నీరు తుడవడమే నిజమైన రాజకీయమని ఆచరణలో చూపించిన మహానేత వైఎస్సార్"అని బాలు నాయక్ అన్నారు.
వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా దేవరకొండ నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలకు చెందిన 242 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.1 కోటి 12 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే బాలు నాయక్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో అండగా నిలుస్తోందన్నారు. ఆరోగ్య సమస్య వచ్చినప్పుడు కుటుంబానికి ఆర్థిక భారం ఎంత తీవ్రంగా ఉంటుందో నాకు తెలుసు. పేద కుటుంబం వైద్యం కోసం అప్పులపాలు కాకూడదన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ఉద్దేశం. అందుకే అర్హులైన ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తున్నాం అని ఎమ్మెల్యే తెలిపారు. లబ్ధిదారులు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అందుతున్న సహాయానికి ఎమ్మెల్యేకు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు.
దేవరకొండలో డయాలసిస్ సేవల విస్తరణ.. 5 పడకల నుంచి 10 పడకలకు
దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో గతంలో 5 పడకల సామర్థ్యంతో ఉన్న డయాలసిస్ కేంద్రాన్ని 10 పడకలకు పెంచినట్లు ఎమ్మెల్యే బాలు నాయక్ తెలిపారు.
కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న పేద రోగులు డయాలసిస్ కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా దేవరకొండలోనే మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఈ సౌకర్యాన్ని విస్తరించామని చెప్పారు.
"పేద రోగులకు వైద్యం అందుబాటులో ఉండాలి. డయాలసిస్ కోసం దూర ప్రాంతాలకు వెళ్లి డబ్బులు ఖర్చు చేసుకునే పరిస్థితి ఉండకూడదు. దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిని మరింత బలోపేతం చేసి, అవసరమైన వైద్య సదుపాయాలను అందుబాటులోకి తీసుకువస్తాం"లి అని బాలు నాయక్ అన్నారు.
దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్ కోసం గతంలో నల్లగొండ జిల్లా ఆసుపత్రికి వెళ్లాల్సి రావడంతో ప్రయాణం, సమయం, ఖర్చులతో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవని ఎమ్మెల్యే తెలిపారు.
ఈ సమస్యను గుర్తించిన ప్రభుత్వం, అధికారుల సహకారంతో ఇప్పుడు దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలోనే వారానికి రెండు రోజులు---ప్రతి సోమవారం, శుక్రవారం---సదరం క్యాంపులు నిర్వహించే విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.
దివ్యాంగులు సదరం సర్టిఫికెట్ కోసం నల్లగొండకు వెళ్లి ఇబ్బందులు పడాల్సిన అవసరం లేకుండా దేవరకొండలోనే సేవలు అందుబాటులోకి తీసుకువచ్చాం. ప్రభుత్వ సేవలు ప్రజల దగ్గరకు రావాలి.. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకూడదు. ఇదే ప్రజా పాలన లక్ష్యం" అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.
దివ్యాంగుల పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని, వారికి అవసరమైన సంక్షేమ పథకాలు సులభంగా అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.
వైఎస్సార్ ఆశయాలతో.. రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో సంక్షేమానికి పెద్దపీట
దివంగత వైఎస్సార్ ఆశయాలకు అనుగుణంగా పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే బాలు నాయక్ తెలిపారు.
"వైఎస్సార్ పేదల కోసం ఏ విధంగా ఆలోచించారో.. అదే స్ఫూర్తితో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తోంది. పేదలకు వైద్యం, ఇళ్లు, రేషన్, రైతులకు సంక్షేమం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్ వంటి అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నాం" అని అన్నారు.
దేవరకొండ నియోజకవర్గంలో వైద్య, విద్య, రహదారులు, సాగునీరు, తాగునీరు, సంక్షేమం తదితర రంగాల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని ఎమ్మెల్యే తెలిపారు.
ఈ కార్యక్రమంలో పట్టణ మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, మండల పార్టీ అధ్యక్షుడు మారుపాక సురేష్ గౌడ్, చింతపల్లి మండల అధ్యక్షుడు జటావత్ హరినాయక్, చందంపేట మండల అధ్యక్షుడు దొండేటి మల్లారెడ్డి, కొండమల్లేపల్లి మండల అధ్యక్షుడు కాసర్ల వెంకటేశ్వర్లు, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు ఎరుకల వెంకటయ్య గౌడ్, ఊట్కూరి వేమన్ రెడ్డి, మేకల రాజేందర్ రెడ్డి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు కిన్నెర హరికృష్ణ, పట్టణ కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్రలో 'బ్రహ్మోస్'కు బాటలు

-416.18 ఎకరాల భూసేకరణ పూర్తి.. సీఎం రేవంత్ రెడ్డి చొరవతో కీలక ముందడుగులి

-ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి కృషికి ఫలితం -- రక్షణ రంగ పరిశ్రమకు దేవరకద్ర వేదికలి

దేవరకద్ర: సెప్టెంబర్ 2 మహాప్రభ .
దేవరకద్ర నియోజకవర్గ పారిశ్రామిక ప్రగతిలో మరో కీలక ముందడుగు పడింది. ప్రతిష్టాత్మక బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ యూనిట్ ఏర్పాటుకు మార్గం మరింత సుగమమైంది. దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి చేస్తున్న నిరంతర కృషికి తోడు, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు ఏర్పాటుపై ఆశలు మరింత బలపడ్డాయి. దేవరకద్ర మండలంలో డీఆర్డీఎల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ యూనిట్ కోసం 416.18 ఎకరాల భూసేకరణ పూర్తయింది. ఈ భూమిని ప్రాజెక్టు కోసం కేటాయించేందుకు టీజీఐఐసీ ఇప్పటికే అంగీకరించిన విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో జరిగిన సమావేశంలో వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చేసిన విజ్ఞప్తిపై



కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సానుకూలంగా స్పందించడంతో దేవరకద్రలో బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ యూనిట్ ఏర్పాటుకు కీలక మద్దతు లభించినట్లైంది. దీంతో దేవరకద్ర నియోజకవర్గం రక్షణ రంగ పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలమైన ప్రాంతంగా మరోసారి ప్రత్యేక గుర్తింపు పొందే దిశగా అడుగులు పడుతున్నాయి.
యువతకు ఉపాధి.. ప్రాంతానికి పారిశ్రామిక ప్రగతి
బ్రహ్మోస్ వంటి అత్యంత ప్రతిష్టాత్మక రక్షణ రంగ ప్రాజెక్టు దేవరకద్రకు రావడం వల్ల ఈ ప్రాంతంలో పారిశ్రామిక కార్యకలాపాలు వేగం పుంజుకునే అవకాశం ఉంది. స్థానిక యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా భారీ స్థాయిలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందుబాటులోకి రావడంతో పాటు అనుబంధ పరిశ్రమలు, సేవా రంగాలు అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయి. ఈ ప్రాజెక్టు కేవలం దేవరకద్ర నియోజకవర్గానికే పరిమితం కాకుండా మహబూబ్‌నగర్ జిల్లాను రక్షణ రంగ తయారీ కేంద్రంగా అభివృద్ధి చేసే దిశలో ఒక కీలక అడుగుగా నిలవనుంది.
ఎమ్మెల్యే కృషికి మరో ముందడుగు
దేవరకద్ర నియోజకవర్గానికి భారీ పరిశ్రమలు, రక్షణ రంగ సంస్థలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను తీసుకురావాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి చేస్తున్న ప్రయత్నాల్లో బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ యూనిట్ ఏర్పాటు ఒక కీలక మైలురాయిగా నిలుస్తోంది. ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ పూర్తికావడం, రాష్ట్ర ప్రభుత్వం భూమి కేటాయింపునకు సానుకూలంగా ఉండటం, కేంద్ర రక్షణ శాఖ నుంచి సానుకూల స్పందన రావడంతో దేవరకద్ర పారిశ్రామిక ప్రగతిలో కొత్త అధ్యాయం ప్రారంభం కానుందనే ఆశాభావం నియోజకవర్గ ప్రజలు, యువతలో వ్యక్తమవుతోంది.

పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు ఘనంగా

దేవరకద్ర: సెప్టెంబర్ 2 మహాప్రభ
జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను దేవరకద్ర నియోజకవర్గంలో ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు కేక్ కట్ చేసి పవన్ కళ్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పవన్ కళ్యాణ్ ఆశయాలు, ప్రజాసేవా స్ఫూర్తితో ముందుకు సాగాలని అభిమానులు ఆకాంక్షించారు. ఆయనకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని కోరుకున్నారు.



ఈ కార్యక్రమంలో ఎం.డి. సమీర్, బాలు, పవన్, అరవింద్, వినోద్ గౌడ్, ప్రేమ్, రాంమోహన్, సాయి తదితర జనసేన పార్టీ అభిమానులు పాల్గొన్నారు.
కావాలంటే ఇదే వార్తను ఇంకాస్త పవర్‌ఫుల్ రాజకీయ వార్తా శైలిలో, లేదా స్థానిక పేపర్‌లో వచ్చే చిన్న వార్తా ఫార్మాట్‌లో కూడా మార్చగలను.

రైతులకు నిరంతర విద్యుత్.. పంటలకు చివరి వరకు సాగునీరు

-ఎమ్మెల్యే బాలు నాయక్



దేవరకొండ సెప్టెంబరు 2 (మహాప్రభ)

దేవరకొండ నియోజకవర్గంలోని విద్యుత్, ఇరిగేషన్, పోలీస్ శాఖ అధికారులతో ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ సమీక్ష నిర్వహించారు. సరైన సమయంలో ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో నీటి లభ్యతపై దృష్టి పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని, అందుబాటులో ఉన్న డిండి ప్రాజెక్టు నీటిని పొదుపుగా, ప్రణాళికాబద్ధంగా వినియోగించి ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు చివరి వరకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. రైతులు కూడా నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించేలా అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. అదేవిధంగా గ్రామాల్లో రైతులు, ప్రజలకు ఎక్కడా విద్యుత్ అంతరాయం కలగకుండా,అవసరమైన చోట కొత్త విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయిన వెంటనే మరమ్మతులు చేసి సరఫరాను పునరుద్ధరించాలని సూచించారు.

వర్షాలు సకాలంలో లేక నీటి లభ్యతపై జాగ్రత్తగా వ్యవహరించాల్సిన పరిస్థితి ఉంది. ప్రస్తుతం సాగులో ఉన్న రైతుల పంటలు ఎండిపోకుండా డిండి ప్రాజెక్టు నీటిని పొదుపుగా వినియోగించి చివరి వరకు నీరు అందించాలి. రైతులకు విద్యుత్, సాగునీటి విషయంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలి"అని ఎమ్మెల్యే బాలు నాయక్ తెలిపారు. సమీక్షలో విద్యుత్, ఇరిగేషన్, పోలీస్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాజీ ముఖ్యమంత్రి దివంగత వైయస్.

- రాజశేఖర్ రెడ్డి కి ఘణ నివాళులు.



తూప్రాన్, సెప్టెంబర్ 2 (మహాప్రభ)

దివంగత మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి 17వ. వర్ధంతి వేడుకలను తూప్రాన్ మున్సిపల్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు గరిగే నర్సింగరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. నర్సాపూర్ చౌరస్తా వద్ద దివంగత మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రెండు పర్యాయాలు ముఖ్యమంత్రిగా పనిచేసి పేదల పక్షాన నిలబడ్డ వ్యక్తిగా పేరు ప్రఖ్యాతలతో మహానేతగా గుర్తింపు పొందారని చేతికి ఎముకలేని ప్రధాత, మడమ తిప్పని నేతగా గుర్తింపు పొందారని కొనియాడారు. ఇందులో తూప్రాన్ మండల అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, టౌన్ ప్రధాన కార్యదర్శి అరుణ్ కుమార్, సీనియర్ నాయకులు సత్యనారాయణ, కొడిపాక వెంకటేష్, చిట్టిమిల్ల అనిల్, ఎస్సీ సెల్ అధ్యక్షులు తాడేపు మహేందర్, బొల్లు నరేష్, ఎండి అప్సర్, ఆబోతు వెంకటేష్, తదితరులు ఉన్నారు.

దండుపల్లి లో ఉపాధి హామీ పనుల పై గ్రామసభ.



మనోహరాబాద్, సెప్టెంబర్ 2 (మహాప్రభ)

మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం దండుపల్లి గ్రామ పంచాయతీలో గ్రామ సర్పంచ్ మరాఠీ నాగరాజు ఆధ్వర్యంలో ఉపాధి హామీ పనుల ఎంపికలో భాగంగా గ్రామసభను నిర్వహించడం జరిగింది. ముఖ్యంగా గ్రామంలోని ఉపాధి హామీ పనుల ఎంపిక విషయంలో ఎక్కడెక్కడ పనులను చేపట్టాలో ఏ మేర పనులు కొనసాగించాలో అధికారులు సూచించారు. అనంతరం గ్రామంలో ఉన్న మౌలిక వసతుల పై చర్చించారు. ఇందులో ఈసీ లక్ష్మీనారాయణ, ఇన్చార్జి సెక్రటరీ శ్రీనివాస్, ఫీల్డ్ అధికారి కృష్ణ, సీనియర్ మేట్ కనకరాజు ఉపసర్పంచ్ నాగమణి, గ్రామ పాలక సభ్యులు, గ్రామస్తులు ఉన్నారు.

నర్సంపల్లి లో విబి-జి ఆర్ఏఎం-జి గ్రామసభ.



తూప్రాన్, సెప్టెంబర్ 2 (మహా ప్రభ)

మెదక్ జిల్లా తూప్రాన్ మండలం నర్సంపల్లి గ్రామంలో విబి-జి, ఆర్ఏ ఎం-జి గ్రామసభను గ్రామ సర్పంచ్ ధరావత్ భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలోని పనికి ఆహార పథకంలో గ్రామ మహిళలు ప్రతి ఒక్కరు పాల్గొనాలని తద్వారా ఆర్థికంగా ఎదగాలని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో కావాల్సిన మౌలిక వసతులపై చర్చించారు. ఇందులో గ్రామ సెక్రెటరీ స్వామి, నాయకులు జింక మల్లేష్, గ్రామ ఉపసర్పంచ్ బోయిని స్వామి, పాలకవర్గం సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ హామీలపై ఇంటింటి పోరుబాట.



తూప్రాన్, సెప్టెంబర్ 2 (మహాప్రభ)

మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపల్ కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు సతీష్ చారి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన మేనిఫెస్టో 420 హామీలపై పోరుబాట కార్యక్రమానికి బుధవారం శ్రీకారం చుట్టారు. ప్రతి గడపగడపకు ప్రతి షాపుకు వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల కార్డును పంచారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలు గడుస్తున్న నేపథ్యంలో నేటికీ ఇచ్చిన హామీలను నెరవేర్చుకపోవడం సిగ్గుచేటు అన్నారు. మాటల గారడీ తప్ప పనుల విషయంలో చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వమని దుయ్యబడ్డారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో రాష్ట్రం అన్ని రంగాలలో సుభిక్షంగా ముందుకు కొనసాగిందని అన్నారు. ఇందులో మాజీ మున్సిపల్ చైర్మన్, బొంది రవీందర్ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు సత్యనారాయణ గౌడ్, ప్రభాకర్ రెడ్డి, మన్నె శ్రీనివాస్, రాజిరెడ్డి, వెంకటరామిరెడ్డి, కొక్కొండ కాశిరెడ్డి, బజారు చక్రవర్తి, మైనార్టీ నాయకుడు సత్తార్ బిఆర్ఎస్ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పాపన్నపేట...22ఏ లో చేర్చిన రైతు భూములను తక్షణమే తొలగించాలి



పాపన్నపేట, సెప్టెంబర్02(మహా ప్రభ)

మహాధర్నాలో బీజేపీ నేతల డిమాండ్

రాష్ట్ర ప్రభుత్వం 22ఏ లో చేర్చిన రైతు భూములను తక్షణమే తొలగించాలనీ మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు.బుధవారం రోజు మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజక వర్గ కేంద్రంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ)మెదక్ జిల్లా పార్టీ అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో మహాధర్నా కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు, మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్,చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డిలు పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం ఏవైతే పొరపాటు చేసి 22 ఏ లో రైతుల భూములను చేర్చిందో వాటిని తక్షణమే తొలగించాలనీ,దీనితో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.ఈ కార్యక్రమానికి మెదక్ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు బైండ్ల సత్యనారాయణ ముదిరాజు ఆధ్వర్యంలో పాపన్నపేట మండలం నుండి 60 మంది బిజెపి నాయకులు,కార్యకర్తలు తరలి వెళ్లినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు బీకొండ రాములునేత,కిసాన్ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రన్న,కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు సిద్ధిరాములు, నార్సింగ్ ఉపసర్పంచ్ శ్రీరామ్ నరేష్,సీనియర్ నాయకులు దుర్గయ్య, డా.రాజేందర్,బుల్లెట్ యేసు,మాజీ జనరల్ సెక్రెటరీ దుర్గాప్రసాద్, శంకర్ గౌడ్,నామపూర్ వార్డ్ మెంబర్ కుమార్, పాపన్నపేట సుంకరి కిష్టయ్య, కనకంటి విట్టల్ ,దుర్గయ్య,గోపాల్, రామచందర్, వెంకట్,మల్లేశం,నాగరాజ్ తదితరులు వెళ్లిన వారిలో ఉన్నారు.

విశ్వబ్రాహ్మణులు అన్ని రంగాల్లో ముందుండాలి

-సంఘం జిల్లా అధ్యక్షుడు దేమె రాజు చారి



గాంధారి: సెప్టెంబర్ 02 (మహాప్రభ)

విశ్వబ్రాహ్మణులు అన్ని రంగాల్లో ముందుండాలని సంఘం జిల్లా అధ్యక్షుడు దేమె రాజు చారి అన్నారు.బుధవారం గాంధారి మండల కేంద్రంలోని హారాలే గార్డెన్స్ లో నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన జిల్లా స్థాయి నాయకులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అంతకు ముందు విశ్వబ్రాహ్మణ జెండాను ఎగరవేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో విశ్వబ్రాహ్మణులు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని, ప్రభుత్వం దీనిని గుర్తించి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని వర్గాల వారు రాజకీయంగా ముందుండగా, విశ్వబ్రాహ్మణులు మాత్రమే అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని, ప్రభుత్వం సరైన ప్రోత్సాహం అందించాలని కోరారు. జిల్లాతో పాటు రాష్ట్రంలో కొన్ని గ్రామాలలో మాత్రమే సర్పంచులుగా, వార్డు సభ్యులుగా గెలుపొందారని, రాబోయే రోజుల్లో విశ్వబ్రాహ్మణులందరూ ఐక్యంగా ఉండి డిమాండ్లను సాధించుకునేలా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్ల భీమయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు వడ్ల సిద్ధిరాములు, గాంధారి మండల అధ్యక్షుడు కమ్మరి సురేష్, ఎల్లారెడ్డి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అవుసుల రాజు చారి, గాంధారి సంఘం అధ్యక్షుడు కమ్మరి పండరి, జిల్లా మాజీ అధ్యక్షుడు పుండరీ చారి, మండలంలోని అన్ని గ్రామాల సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యంలో.. సంక్షేమ ఫలాలు

-మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు



పాపన్నపేట, సెప్టెంబర్02(మహా ప్రభ)

ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి గ్రామానికి కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రజలకు అందుతున్నాయని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు పేర్కొన్నారు. బుధవారం పాపన్నపేట ఎంపీడీఓ కార్యాలయంలో ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. గత ప్రభుత్వంలో రేషన్ కార్డులు పంపిణీ చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతు రుణమాఫీ,ఇందిరమ్మ ఇండ్లు,స్మార్ట్ రేషన్ కార్డులు,సన్న బియ్యం పేదలకు అందిస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో తహశీల్దార్ సతీష్ కుమార్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నరేందర్ గౌడ్,సర్పంచుల ఫోరమ్ మండలాధ్యక్షుడు వెంకటేశం,నాయకులు ప్రభాకర్ రెడ్డి,ప్రశాంత్ రెడ్డి,గోవింద్ నాయక్,మల్లప్ప,సూఫీ తదితరులు ఉన్నారు.

క్యూలైన్లో చెప్పులు ..యూరియా తిప్పలు

- సొసైటీల వద్ద పడిగాపులు

-సర్వర్ రాక ఈ పాస్ మిషన్ పనిచేయక నానా తిప్పలు



పాపన్నపేట, సెప్టెంబర్02(మహాప్రభ)

యూరియా కోసం రైతన్నలు తిప్పలు పడుతూనే ఉన్నారు. ఒక్క యూరియా బ్యాగ్ కోసం రోజంతా తిండి తిప్పలు, పనులు మానుకొని నానా పాట్లు పడుతున్నారు. తాజాగా బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం ముందు ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో చెప్పులు ఇలా క్యూలైన్ లో పెట్టి కార్యాలయ భవనాల నీడ పట్టుకు పడిగాపులు కాస్తున్నారు. రైతును రాజును చేస్తామని చెబుతున్న ప్రభుత్వాలు యూరియా కోసం ఇలా క్యూ లైన్ లో నిలబెట్టి బికార్లను చేస్తారా అని రైతులు ఆగ్రహిస్తున్నారు. సొసైటీల వద్దనే ఇలా పడి కాపులు పడాల్సి వస్తుందని.. ప్రవేట్ డీలర్ల వద్ద ఇంత ఇబ్బంది లేదని వాపోతున్నారు. యూరియా కోసం రైతన్నలు ఇలా తిప్పలు పడకుండా చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు .

కల్వకుర్తిలో ఘనంగా బోనాల పండుగ

-పాల్గొన్న బీజేపీ రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి



కల్వకుర్తి, సెప్టెంబర్02(మహాప్రభ)

నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో నిర్వహించిన బోనాల పండుగలో బీజేపీ రాష్ట్ర నాయకులు, నాగర్‌కర్నూల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు, కరాటే అసోసియేషన్ చైర్మన్ ముచ్చర్ల జనార్దన్ రెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ముచ్చర్ల జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులు, కౌన్సిలర్లు, మండల, పట్టణ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి..

-ఎమ్మెల్యే బాలు నాయక్ సంతాపం

-ఎండీ బందగీ మృతదేహానికి పూలమాల వేసి నివాకులర్పించిన దేవరకొండ ఎమ్మెల్యే

-కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపిన బాలు నాయక్



దేవరకొండ సెప్టెంబర్ 2 (మహాప్రభ)

డిండి మండలం కందుకూరు గ్రామానికి చెందిన సీపీఐ నాయకుడు ఎండి మైనోద్దీన్ కుమారుడు బందగీ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలుసుకున్న దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని బందగీ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ తీవ్ర దిగ్భ్రాంతి, సంతాపం వ్యక్తం చేశారు. ఎండీ బందగీ మృతితో కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోవడం బాధాకరమని ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బందగీ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు. అనుకోని రీతిలో జరిగిన ప్రమాదంలో యువకుడిని కోల్పోవడం ఎంతో బాధాకరమని, మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే బాలు నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ముక్కమల్ల వెంకటయ్య గౌడ్, దేవరకొండ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మారుపాకుల సురేష్ గౌడ్, చందంపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దొండేటి మల్లారెడ్డి, డిండి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొంతినేని వెంకటేశ్వరరావు, మైనంపల్లి సర్పంచ్ కొర్ర రాంసింగ్ నాయక్ తదితరులు పాల్గొని బందగీ మృతికి సంతాపం తెలిపారు.

ప్రారంభమైన పెద్దమందడి రోడ్డు నిర్మాణం పనులు

-కొన్ని సాంకేతిక కారణాల వల్ల జాప్యం

-రోడ్డు నిర్మాణానికి మంజూరైన రూ. 40కోట్లు

-పలు సాంకేతిక కారణాల ద్వారా ఆలస్యమైన రూ . 40 కోట్ల పెద్దమందడి రోడ్డు నిర్మాణం పనులు బుధవారం ప్రారంభమయ్యాయి!!

-పనులు మొదలవుతున్నాయని తెలుసుకున్న టిఆర్ఎస్ నాయకులు వారి చిల్లర ప్రయత్నాలు మొదలుపెట్టారు



మహాప్రభ న్యూస్ వనపర్తి జిల్లా ప్రతినిధి

బీమా మోటర్లు ప్రారంభిస్తున్నారని తెలుసుకున్న టిఆర్ఎస్ నాయకులు నీటిని విడుదల చేస్తున్నారని తెలుసుకొని ప్రెస్ మీట్ లు పెట్టి, కే ఎల్ ఐ ద్వారా నీటిని విడుదల చేస్తున్నారని తెలుసుకొని, కర్నే తండా లిఫ్ట్ ప్రారంభిస్తారని తెలుసుకొని ప్రెస్ మీట్ లు పెట్టడం ప్రాజెక్టు సందర్శన చేయడం, తద్వారా తాము నిరసనలు చేయడం వల్లనే నీళ్లు వదిలారంటూ చెప్పుకునే ప్రయత్నం చేసి విఫలమయ్యారు నేడు పెద్దమందడి రోడ్డు పనులు ప్రారంభమవుతాయని తెలుసుకొని పాదయాత్రలు అంటూ ప్రచారాలు చేయడం హాస్యాస్పదంలిపెద్దమందడి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కుమ్మ వెంకటస్వామి తెలిపారు కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలన కొనసాగిస్తోంది మా చిత్తశుద్ధిని శంఖించాల్సిన అవసరం లేదు పనులు ప్రారంభించేముందు ప్రారంభం తర్వాత ఇలాంటి చిల్లర పాదయాత్రలు, సందర్శనలు ప్రెస్ మీట్ లు పెట్టడం టిఆర్ఎస్ పార్టీకి మామూలే టిఆర్ఎస్ నాయకుల ఉనికి కాపాడుకోవడం కోసమేనని విజ్ఞులైన ప్రజలకు తెలుసు

కాంగ్రెస్ 420 హామీలపై బీఆర్ఎస్ పోరుబాట..

వెయ్యి రోజులు గడిచినా అమలుకు నోచుకోని హామీలు.. 420 అడుగుల ప్లెక్సీ ప్రదర్శన,

ప్రజలకు 'బాకీ కార్డుల' పంపిణీ..

మెదక్ జిల్లా -02సెప్టెంబర్ (మహాప్రభ).

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలను 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పి.. వెయ్యి రోజులు గడుస్తున్నా వాటిని నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం మెదక్‌లో నిరసన చేపట్టారు. పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి.సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, నాయకులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్లు ఆరేళ్ల మల్లికార్జున్ గౌడ్ బట్టి జగపతి,పట్టణ పార్టీ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు,బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. మెదక్ పట్టణంలోని హెడ్ పోస్టాఫీస్ వద్ద అంబేద్కర్ చౌరస్తా నుంచి రాందాస్ చౌరస్తా వరకు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చి నెరవేర్చని హామీలు 420 అడుగుల పొడవైన ప్లెక్సీతో ప్రదర్శన చేపట్టారు. అనంతరం అక్కడ ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రస్తావిస్తూ 'బాకీ కార్డులు' ముద్రించి ప్రజలకు పంపిణీ చేశారు. హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని వివరిస్తూ పంపిణీ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

"మా 1000 రోజుల అభివృద్ధి లెక్క ఇదిగ..

-మీ పదేళ్ల లెక్క ఏమిటో చెప్పండి"

-రూ.2,389 కోట్ల అభివృద్ధి.. శ్వేతపత్రంతో లెక్క చెబుతాం!

-10 ఏళ్ల అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

-విపక్షాలకు ఎమ్మెల్యే మేఘారెడ్డి సవాల్..

- కేఎల్ఐ, పాలమూరు-రంగారెడ్డి, వెలిగొండపై ఘాటు వ్యాఖ్యలు



మహాప్రభ న్యూస్ వనపర్తి

ప్రజా ప్రభుత్వం 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా వనపర్తి నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై శ్వేతపత్రం విడుదల చేస్తామని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రకటించారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు రూ.2,389 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని, ఆరు గ్యారంటీల అమలుకు సుమారు రూ.1,000 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి, తమ ప్రభుత్వం 1000 రోజుల్లో చేసిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా? అంటూ ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు.అప్పులకు వడ్డీలు చెల్లిస్తూనే సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని, తమ ప్రభుత్వంపై విమర్శలు చేసే వారు గత పదేళ్లలో ఏం చేశారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. "మా 1000 రోజుల అభివృద్ధి లెక్క ఇదిగో.. మీ పదేళ్ల లెక్క ఏమిటో చెప్పండి" అంటూ ప్రతిపక్ష నేతలను నిలదీశారు.

కేఎల్ఐపై ఎవరి వాటా ఎంత?

కల్వకుర్తి ఎత్తిపోతల పథకంపై కాంగ్రెస్ ఏమీ చేయలేదంటూ చేస్తున్న విమర్శలను ఎమ్మెల్యే తిప్పికొట్టారు. మాజీ మంత్రి చిన్నారెడ్డి హయాంలో డీ-5, డీ-8, బుద్ధారం ప్రాంతాల్లో వేల ఎకరాలకు నీటి సౌకర్యం కల్పించేందుకు పనులు జరిగాయని పేర్కొన్నారు. కర్నెతండా, బుద్ధారం, ఖిల్లాఘణపురం బ్రాంచ్ కెనాల్‌కు సంబంధించి సుమారు 45 వేల ఎకరాలకు నీరందించే పనులకు టెండర్లు పూర్తయ్యాయని, 50 శాతం పనులు గతంలో జరిగితే మిగిలిన పనులను తమ ప్రభుత్వం పూర్తి చేసిందని తెలిపారు.పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని తామే ప్రారంభించి పూర్తి చేశామని చెప్పుకోవడం సరికాదని, గతంలో చేసిన పనులకు ఇప్పుడు రాజకీయ రంగు పులుముతున్నారని విమర్శించారు. కేఎల్ఐలో 90 శాతం పనులు పూర్తయిన తర్వాత మిగిలిన 10 శాతం పనులు చేసి మొత్తం తామే పూర్తి చేశామని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు.

'నా డబ్బులు తిన్నాలేదు అంటే వెంకటేశ్వరస్వామి గుడికి రండి"

తనపై వస్తున్న వ్యక్తిగత ఆరోపణలపైనా ఎమ్మెల్యే తీవ్రంగా స్పందించారు. "నేను కూలీని.. నా డబ్బులు పందికొక్కులు తిన్నారో లేదో తేల్చుకుందాం. వెంకటేశ్వరస్వామి గుడికి రండి.. నేను వస్తా.. మీరు సిద్ధమా?" అంటూ సవాల్ విసిరారు.తాను భూమి కొనుగోలు చేసిన విషయం వాస్తవమేనని, ఆ వ్యవహారానికి జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి సాక్షిగా ఉన్నారని చెప్పారు. 39 గుంటల భూమిని ఎవరి పేరున రాసి ఇవ్వమన్నా ఇస్తానని పేర్కొన్నారు. దీనిపై రఘుపతిరెడ్డి మీడియా సమావేశం పెట్టి వాస్తవాలు చెప్పాలని డిమాండ్ చేశారు.

"వెలిగొండపై పదేళ్లలో ఏం చేశారు?"

వెలిగొండ ప్రాజెక్టును అడ్డుకోవాలని కోరుతూ గత పదేళ్లలో ఏం చేశారో ప్రతిపక్ష నేతలు సమాధానం చెప్పాలని మేఘారెడ్డి ప్రశ్నించారు. పాలమూరు-రంగారెడ్డి, వెలిగొండ, కేఎల్ఐ ప్రాజెక్టుల విషయంలో ప్రజలను తప్పుదోవ పట్టించేలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు.నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణకు రూ.182 కోట్లు చెల్లించామని, అభివృద్ధి పనులకు ఆటంకంగా ఉన్న సమస్యలను తమ ప్రభుత్వం పరిష్కరిస్తోందని తెలిపారు.

"ప్రధాన నాయకుడు ఎక్కడ?"

బీఆర్ఎస్ పాలనపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించిన ఎమ్మెల్యే.. "1000 రోజుల్లో 22 కోట్ల జీతం ఇచ్చాం.. 22 రూపాయల పని చేశారా?" అంటూ ప్రశ్నించారు. తమ ప్రభుత్వం లోటుపాట్లను సరిచేస్తూ 76 వేల ఉద్యోగాలు కల్పించిందని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో వేలాది పాఠశాలలు మూతపడ్డాయని ఆరోపించారు.పింఛన్ల విషయంలోనూ గత ప్రభుత్వాన్ని నిలదీశారు. వయస్సు పరిమితిని 58 నుంచి 61 సంవత్సరాలకు పెంచింది ఎవరి ప్రభుత్వమో ప్రజలకు తెలుసన్నారు. ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేని వారు ఇప్పుడు తమ ప్రభుత్వాన్ని విమర్శించడం హాస్యాస్పదమన్నారు.

"ప్రజల ముందే లెక్కలు తేల్చుకుందాం"

డీసీసీ జిల్లా అధ్యక్షుడు శివసేనారెడ్డి మాట్లాడుతూ.. ప్రతిపక్ష నేతలు ముందుగా ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. మేధావులమని చెప్పుకునే నాయకులు ప్రజలకు ఎలాంటి దారి చూపుతున్నారో ఆలోచించుకోవాలని అన్నారు."మీకన్నా మేము మూడు ఆకులు ఎక్కువే చదువుకున్నాం. బూట్లు నాకే వ్యవస్థ ఎవరిదో ప్రజలకు తెలుసు" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో అప్పుల చెల్లింపులకు భారీగా నిధులు వెచ్చిస్తూ, ఇరిగేషన్ రంగానికి కూడా ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు.పాలమూరు-రంగారెడ్డి, కేఎల్ఐ ప్రాజెక్టులను తామే ప్రారంభించి పూర్తి చేశామని చెప్పుకునే ముందు గత పదేళ్ల లెక్క చెప్పాలని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. వనపర్తి నియోజకవర్గంలో తమ ప్రభుత్వం చేపట్టిన ప్రతి అభివృద్ధి పనిని ప్రజల ముందుంచుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సాయిచరణ్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్. మాజీ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, జిల్లా పార్టీ కార్యవర్గం, కౌన్సిలర్లు, సర్పంచు లు మాజీ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

హామీల అమలుకు సమరశంఖం.. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై దేవరకద్రలో బీఆర్ఎస్ గర్జన





ఆరు గ్యారెంటీలు.. 420 హామీలు ఏమయ్యాయి?' అంటూ భారీ నిరసన ర్యాలీ। మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణుల ఆందోళన

దేవరకద్ర సెప్టెంబర్ 2 మహాప్రభ

దేవరకద్ర: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన హామీల అమలుపై ప్రశ్నిస్తూ దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులు భారీ నిరసన ర్యాలీ నిర్వహించాయి. మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, ఆల ప్రీతి రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై తమ నిరసనను వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలుపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ శ్రేణులు ప్లకార్డులు ప్రదర్శించారు. హామీలను గుర్తు చేసేలా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీ ఈ కార్యక్రమంలో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. దేవరకద్ర సంత బజార్ నుంచి ఎస్‌బీఐ బ్యాంక్ వరకు భారీ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు హామీల అమలు, రైతులు, మహిళలు, విద్యార్థులు, వృద్ధులు, నిరుద్యోగులు తదితర వర్గాలకు సంబంధించిన సమస్యలను ప్రస్తావిస్తూ నినాదాలు చేశారు.

గ్యారెంటీ కార్డులు పట్టుకొని ప్రజలు ఎదురుచూస్తున్నారు' ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిందని, అయితే ప్రభుత్వం ప్రకటించిన హామీల అమలుపై ప్రజల్లో తీవ్ర నిరాశ నెలకొందని అన్నారు. "కాంగ్రెస్ ఇచ్చిన గ్యారెంటీ కార్డులు పట్టుకొని ప్రజలు ఎదురుచూస్తున్నారు. వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పిన హామీలు వెయ్యి రోజులు గడిచినా పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోలేదు. హామీలను నమ్మి కాంగ్రెస్‌కు అధికారం

ఇస్తే ప్రజలను మోసం చేసిందనే భావన ప్రజల్లో ఏర్పడింది" అని ఆల వెంకటేశ్వర్‌రెడ్డి విమర్శించారు. రైతులు పంటలు పండించేందుకు, పండించిన పంటలను విక్రయించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. వృద్ధులు, మహిళలు, రైతులు, విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలపై బీఆర్ఎస్ నిరంతరం ప్రజా క్షేత్రంలో పోరాడుతుందని తెలిపారు.

'ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలి'

ప్రభుత్వ ప్రాధాన్యత సామాన్య ప్రజల సంక్షేమం కావాలని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆల వెంకటేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

రైతు భరోసా, ధాన్యం కొనుగోళ్లు, బోనస్, యూరియా సరఫరా, మహిళలకు ఆర్థిక సాయం, విద్యార్థులకు హామీ ఇచ్చిన పథకాలు, వృద్ధులు, బీడీ కార్మికులు, దివ్యాంగులు, నిరుద్యోగులు, ఆటో కార్మికులు తదితర వర్గాలకు సంబంధించిన హామీలను బీఆర్ఎస్ నాయకులు ఈ సందర్భంగా ప్రస్తావించారు.

కాలేజీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతు భరోసా, రైతు కూలీలకు ప్రకటించిన ఆర్థిక సహాయం, నిరుద్యోగులకు ఉద్యోగాల హామీ, విద్యా భరోసా కార్డు తదితర అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. "ఇచ్చిన హామీలపై ప్రజలకు సమాధానం చెప్పాలి. గత ప్రభుత్వ హయాంలో అమలైన సంక్షేమ పథకాలను కొనసాగించడంతో పాటు ప్రజలకు ఇచ్చిన హామీలను కూడా అమలు చేయాలి. హామీల అమలు జరిగే వరకు బీఆర్ఎస్ ప్రభుత్వం మీద ప్రజాస్వామ్య పద్ధతిలో ఒత్తిడి తీసుకువస్తుంది" అని ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు.

పాలమూరు ప్రాజెక్టులపై ప్రశ్నలు

పాలమూరు ప్రాంతానికి చెందిన వ్యక్తి ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ ఉమ్మడి పాలమూరు జిల్లాకు ఆశించిన స్థాయిలో ప్రయోజనం చేకూరడం లేదని ఆయన విమర్శించారు.

శ్రీశైలం ప్రాజెక్టులో నీరు ఉన్న సమయంలో కందూరు వాగు పరిస్థితిపై ప్రభుత్వం దృష్టి సారించాలని, పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనుల పురోగతిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. "ప్రజా సమస్యలు పరిష్కరించడమే ప్రభుత్వ ప్రధాన బాధ్యత. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై ప్రజలకు స్పష్టమైన సమాధానం ఇవ్వాలి. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ ప్రజల తరఫున మరింత బలంగా పోరాడుతుంది" అని ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హామీల అమలుపై బీఆర్ఎస్ చేపట్టిన ఈ నిరసన కార్యక్రమం అనంతరం నాయకులు దేవరకద్ర విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు వెళ్లి 24 గంటల కరెంటు కావాలని సంబంధిత అధికారికి వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్త లు భారీగా పాల్గొన్నారుఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ జట్టి నరసింహారెడ్డి, మాజీ పట్టణ అధ్యక్షుడు మున్నూరు బాలరాజ్, మాజీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్, జినుగురాల రాము, దేవరకద్ర మున్సిపల్ కౌన్సిలర్ రాధా కొండల్, ఉప్పరి సత్యం, అడ్డు డోకూర్ నరేందర్‌రెడ్డి, డోకూర్ ఆశన్న, మున్సిపల్ కౌన్సిలర్ గోప్లాపురం పాండు తదితరులతో పాటు దేవరకద్ర నియోజకవర్గంలోని వివిధ మండలాల బీఆర్ఎస్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. హామీల అమలు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పోరాటాన్ని కొనసాగిస్తుందని నాయకులు తెలిపారు.

పాపన్నపేటలో ఐ జి యల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం..

-అరికెల, నాగ్సన్‌పల్లి, నర్సింగ్రావుపల్లిలో బోర్‌వెల్స్ ఏర్పాటు.
-లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు, పెన్షన్ చెక్కుల పంపిణీ.
-ప్రజా సంక్షేమమే లక్ష్యం.. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే రోహిత్‌రావు ప్రాధాన్యత.



మెదక్ జిల్లా -02సెప్టెంబర్ (మహాప్రభ).
మెదక్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావు బుధవారం తన షెడ్యూల్ ప్రకారం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ పర్యటనలో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించడంతో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, సంక్షేమ పథకాల అమలు, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ ప్రయోజనాలను అందించే కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పాపన్నపేట మండలం అరికెల గ్రామంలో ఐ జి యల్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించడం ఎంతో ముఖ్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.అదేవిధంగా పాపన్నపేట మండలంలోని అరికెల, నాగ్సన్‌పల్లి, నర్సింగ్రావుపల్లి గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చేసేందుకు యం యస్ యస్ ఓ ఆధ్వర్యంలో తన సొంత నిధులతో బోర్‌వెల్స్ ఏర్పాటు చేయించి ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావు ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలను నిరంతరం చేపడతామని ఆయన తెలిపారు.పాపన్నపేట మండలం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. సీఎంఆర్ ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.అనంతరం మెదక్ పట్టణం ఎచ్ కన్వెన్షన్ మెదక్ మండలానికి సంబంధించిన స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. అదే సమయంలో సి యం ఆర్ ఎఫ్ చెక్కులను కూడా పంపిణీ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అందుతున్న ప్రయోజనాలపై ఎమ్మెల్యే లబ్ధిదారులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.అదేవిధంగా హవేలీ ఘన్‌పూర్ మండలంలోని రైతు వేదిక వద్ద స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం జరిగింది. అర్హులైన లబ్ధిదారులకు కార్డులను ఎమ్మెల్యే అందజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేలా ఉపయోగపడుతున్నాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు.
ఎమ్మెల్యే తన పర్యటనలో భాగంగా నాగ్సన్‌పల్లి గ్రామ సర్పంచ్ కుమారుడి హాజరై నూతన వధూవరులను, కుటుంబ సభ్యులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వారి కుటుంబానికి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావు మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.ప్రజలకు తాగునీరు, రేషన్, పెన్షన్ వంటి ప్రాథమిక అవసరాలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను మరింత మెరుగుపరచేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం అభివృద్ధి చెందేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతామని, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తామని డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావు పేర్కొన్నారు. ప్రజల సహకారంతో మెదక్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.

కష్టకాలంలో అండగా నిలిచిన హెచ్డిఎఫ్సి లైఫ్

-బాధిత కుటుంబానికి 24 గంటల్లోనే రూ.20 లక్షల బీమా చెక్కు అందజేత



గాంధారి:సెప్టెంబర్ 02 (మహాప్రభ)
గాంధారి మండలం గౌరారం గ్రామానికి చెందిన వడ్ల శివలక్ష్మి, తన కుటుంబ భవిష్యత్తు కోసం హెచ్డిఎఫ్సి లైఫ్ లో జీవిత బీమా తీసుకున్నారు. దురదృష్టవశాత్తు అనారోగ్యంతో ఆమె మృతి చెందారు. ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఉన్న వేళ, హెచ్డిఎఫ్సి లైఫ్ పెద్ద అండగా నిలిచింది. కేవలం 24 గంటల్లోనే రూ. 20 లక్షల బీమా మొత్తాన్ని బాధిత కుటుంబానికి చెల్లించింది. ఈ సందర్భంగా ఏజెంట్ సలహాదారు కొండయ్య గారి కాశీరాం మాట్లాడుతూ.. కష్టకాలంలో ప్రతి కుటుంబానికి హెచ్డిఎఫ్సి లైఫ్ అండగా ఉంటుందని తెలిపారు. జీవితం అనిశ్చితం, కానీ మన కుటుంబ భవిష్యత్తును సురక్షితం చేసుకోవడం మన చేతుల్లోనే ఉందని, ప్రతి ఒక్కరూ బీమా తీసుకోవాలని కోరారు. గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ చేతుల మీదుగా శాఖ నిర్వాహకులు పురుషోత్తం గౌడ్, అభివృద్ధి నిర్వాహకులు అశోక్, సలహాదారు కాశీరాం రూ. 20 లక్షల చెక్కును అందజేశారు. గ్రామ ప్రజలు వర్షం వ్యక్తం చేశారు.

ఎస్సి, ఎస్టీ కేసుల రహిత జిల్లాగా తీర్చి దిద్దాలి.





-పౌరహక్కుల దినోత్సవాన్ని తప్పకుండా నిర్వహించాలి.
-ఎస్సి,ఎస్టీ ఉద్యోగులతో సానుకూలంగా వ్యవహరించాలి.
-మానవీయ కోణంలో సేవలు అందించాలి.
-రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య.

మెదక్ జిల్లా -02సెప్టెంబర్ (మహాప్రభ)
జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజల అభ్యున్నతికి అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అధికారులను ఆదేశించారు.రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కమిషన్ సభ్యుడు కే.లక్ష్మి నారాయణ లుజిల్లా పర్యటనకు రాగా, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఎస్పీ డివి శ్రీనివాసరావు స్వాగతం పలికి.. పుష్పగుచ్ఛం అందజేశారు.
జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఎస్పీ శ్రీనివాసరావు, కమిషన్ సభ్యుడు కే .లక్ష్మీ నారాయణ తో కలిసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, పథకాల అమలు, సంక్షేమం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ.. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అందుతున్న పథకాలు, సంక్షేమం, అట్రాసిటీ కేసుల పరిష్కారం గురించి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందించే అన్ని పథకాలు అర్హులైన ఎస్సీ, ఎస్టీలకు అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యను అభ్యసిస్తున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల సంఖ్య, అంబేద్కర్ ఓవర్సీస్ పథకం, కులాంతర వివాహాల ఆర్థిక చేయూత, ఇందిరమ్మ ఇండ్లు, జాబ్ కార్డు కలిగిఉన్న ఎస్సీ, ఎస్టీలకు కల్పిస్తున్న పని వివరాలను అధికారుల ద్వారా పోలీసులు, ఇతర శాఖల అధికారుల సేవలను సమీక్షించారు.
ఇప్పటివరకు నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల నమోదు ఛార్జ్ షీట్ దాఖలు వివరాలు తెలుసుకున్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద నమోదయిన కేసుల దర్యాప్తు త్వరితగతిన, పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. బాధితులకు నష్ట పరిహారం అందేవిధంగా చూడాలని వివరించారు. ప్రతినెలా చివరి వారంలో మండలాల్లో సివిల్ రైట్స్ డే నిర్వహించాలని పేర్కొన్నారు. సంబంధిత శాఖల అధికారులు అందరూ సమావేశాల్లో పాల్గొని, ప్రజల్లో ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం అమలుపరుస్తున్న పథకాలు, చట్టాల గురించి అవగాహన కల్పించాలని వివరించారు. ప్రజలకు మానవీయ కోణంలో సేవలు అందించాలని సూచించారు.ఖచ్చితంగా ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించాలని సూచించారు. ఏవైనా అభివృద్ధికి సంబంధించి నిధులు పెండింగ్ ఉంటే రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి విడుదల అయ్యేటట్లు చూస్తానని హామీ ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీ ప్రజల అభ్యున్నతితో పాటు, జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా మరింత కృషి చేయాలని తెలిపారు. ఆయా శాఖల అధికారులు అందరికీ అందుబాటులో ఉండి సేవలు అందించాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో లోని పారిశుధ్య కార్మికులకు ఎస్ బీ ఐ బ్యాంక్ ఖాతాలు తీయించాలని, దీంతో కార్మికులకు భీమా సౌకర్యం ఉందని తెలిపారు.

జిల్లా కలెక్టర్ కు అభినందన
జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సేవలను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అభినందించారు. జిల్లా కలెక్టర్ అందరికీ ఒకే న్యాయం చేస్తారని పేర్కొన్నారు. విద్యార్థులు, ప్రజలకు అందిస్తున్న ఉత్తమ సేవలను కొనియాడారు. ఎస్సీ, ఎస్టీలకు మరింత ఉత్తమ సేవలు అందించాలని సూచించారు.

కామన్ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న పథకాలను జిల్లాలోని ఎస్సీ, ఎస్టీలకు క్షేత్రస్థాయిలో అందే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి పాఠశాల, రెసిడెన్షియల్ విద్యాలయాల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తూ, ప్రతి రోజూ కామన్ మెనూ అమలు చేస్తూ విద్యా బోధన సాగిస్తున్నా మన్నారు. అన్ని విద్యాలయాల్లో ప్రత్యేక అధికారులను నియమించి
తనిఖీ చేయిస్తూ.. విద్యార్థులతో కలిసి భోజనం చేసేలా చూస్తున్నామని, ఏమైనా ఇబ్బందులు ఉంటే ఎప్పటిక ప్పుడు పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులందరికీ ఉపకార వేతనాలు, కులాంతర వివాహాల ఆర్థిక సహకారం, అంబేద్కర్ ఓవర్సీస్ ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు వివరించారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. జిల్లాలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల వివరాలు తెలియజేశారు. కేసుల దర్యాప్తు వేగవంతంగా పూర్తి చేస్తున్నట్లు వివరించారు. వివిధ దశల్లో ఉన్న కేసులను వేగవంతంగా పూర్తి చేసి బాధితులకు న్యాయం కలిగేలా చూస్తామని అన్నారు. కేసుల దర్యాప్తు పారదర్శకంగా చేపడతామని తెలిపారు.
సమావేశంలో అదనపు కలెక్టర్ అంబదాసు రాజేశ్వర్ , డీఎఫ్ఓ జో జి,జెడ్పి సీఈఓ ఎల్లయ్య, డి ఆర్ డి ఓ పి డి శ్రీనివాసరావు, హౌసింగ్ పీడీ మాణిక్యం, ఆర్డీఓలు రమాదేవి, బవయ్య , రామకృష్ణ లు, డీఎస్పీలు ప్రసన్నకుమార్ , నరేందర్ , వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ అధికారులు సింధు, విజయ లక్ష్మి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి నీలిమ, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులు,వివిధ సంఘాల నాయకులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలలకు ఏకరూప దుస్తుల పంపిణీ

ప్రధానోపాధ్యాయులకు అందజేత



గాంధారి: సెప్టెంబర్ 02 (మహాప్రభ)
గాంధారి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఎస్సీ వాడ, ప్రాథమిక పాఠశాల ఉర్దూ మాధ్యమ పాఠశాలలకు చెందిన విద్యార్థుల ఏకరూప దుస్తులను సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య సహాయ కార్యక్రమ నిర్వాహకులు ప్రసన్నకుమార్, సమూహ సమన్వయకర్త గొర్రె రాములు, గ్రామ సమాఖ్య సహాయకురాలు ప్రియాంక పాల్గొన్నారు.

22ఏ లో చేర్చిన రైతు భూములను తక్షణమే తొలగించాలి

-మహాధర్నాలో బీజేపీ నేతల డిమాండ్



మెదక్ జిల్లా 02సెప్టెంబర్ (మహాప్రభ)
రాష్ట్ర ప్రభుత్వం 22ఏ లో చేర్చిన రైతు భూములను తక్షణమే తొలగించాలనీ మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు.బుధవారం రోజు మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజక వర్గ కేంద్రంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ)మెదక్ జిల్లా పార్టీ అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో మహాధర్నా కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు, మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్,చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డిలు పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం ఏవైతే పొరపాటు చేసి 22 ఏ లో రైతుల భూములను చేర్చిందో వాటిని తక్షణమే తొలగించాలనీ,దీనితో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.ఈ కార్యక్రమానికి మెదక్ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు బైండ్ల సత్యనారాయణ ముదిరాజు ఆధ్వర్యంలో పాపన్నపేట మండలం నుండి 60 మంది బిజెపి నాయకులు,కార్యకర్తలు తరలి వెళ్లినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు బీకొండ రాములునేత,కిసాన్ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రన్న,కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు సిద్ధిరాములు, నార్సింగ్ ఉపసర్పంచ్ శ్రీరామ్ నరేష్,సీనియర్ నాయకులు దుర్గయ్య, డా.రాజేందర్,బుల్లెట్ యేసు,మాజీ జనరల్ సెక్రెటరీ దుర్గాప్రసాద్, శంకర్ గౌడ్,నామపూర్ వార్డ్ మెంబర్ కుమార్, పాపన్నపేట సుంకరి కిష్టయ్య, కనకంటి విట్టల్ దుర్గయ్య,గోపాల్, రామచందర్, వెంకట్,మల్లేశం,నాగరాజ్ తదితరులు వెళ్లిన వారిలో ఉన్నారు.

చిన్నారుల ఆరోగ్యానికి మానస హాస్పిటల్ చేయూత

-రూ.3,500 విలువైన కిట్లు పది మంది చిన్నారులకు పంపిణీ



చింతపల్లి, 02సెప్టెంబర్ (మహాప్రభ)
చింతపల్లి మండలం గోడకొండ్ల గ్రామంలోని మాల్ వీటీ నగర్‌లో ఏర్పాటు చేసిన మానస హాస్పిటల్ ఆధ్వర్యంలో చిన్నారులకు కిట్ల పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక్కొక్కటి రూ.3,500 విలువైన కిట్లను మొత్తం 10 మంది చిన్నారులకు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కాశగోని వెంకటయ్య మాట్లాడుతూ.. మానస హాస్పిటల్ యాజమాన్యం గ్రామ ప్రజలకు లాభాపేక్ష లేకుండా వైద్య సేవలు అందించాలని కోరారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ఆరోగ్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మానస, డాక్టర్ దీపక్, హాస్పిటల్ యాజమాన్యం, సిబ్బంది, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

అబద్ధపు హామీలతో అధికారం..

1000 రోజుల్లో ప్రజలకు మిగిలిందేమిటి
-కాంగ్రెస్ పాలనపై ఆల ప్రీతి రెడ్డి ధ్వజం
- దేవరకద్రలో బీఆర్ఎస్ భారీ నిరసన ర్యాలీ



దేవరకద్ర, సెప్టెంబర్ 2: మహాప్రభ దేవరకద్ర
అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో ప్రజలకు చేసిందేమిటో సమాధానం చెప్పాలని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి కుమార్తె ఆల ప్రీతి రెడ్డి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ 1000 రోజుల పాలనను నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం దేవరకద్ర నియోజకవర్గంలో భారీ ర్యాలీ, నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి ఆదేశాలతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
ఆల ప్రీతి రెడ్డి ర్యాలీలో పాల్గొని ప్రభుత్వ విధానాలపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. “హామీలతో అధికారంలోకి వచ్చి.. ఇప్పుడు ఆ హామీలను మరిచిపోవడం ప్రజలను మోసం చేయడమే” అని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి సంక్షేమ పథకాలపై కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ప్రీతి రెడ్డి ఆరోపించారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలిచే సంక్షేమ పథకాలను కొనసాగించాల్సింది పోయి వాటిని నిర్వీర్యం చేసే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. 1000 రోజుల పాలన పూర్తయిన సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేసి, ఒక్కో హామీ అమలు స్థితిని ప్రజల ముందు ఉంచాలని ఆమె డిమాండ్ చేశారు. మాటలకే పరిమితమైన పాలనకు ముగింపు పలికి, ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆమె హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. దేవరకద్రలో నిర్వహించిన ఈ ర్యాలీతో కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనపై బీఆర్ఎస్ తన రాజకీయ పోరాటాన్ని మరింత ఉధృతం చేసింది.

వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

-ఎల్లారెడ్డి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నేతల నివాళి



ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 2, (మహాప్రభ):
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత డా. వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ఎల్లారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆదేశాల మేరకు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రిగా వైఎస్సార్ పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థులు, కార్మికులు సహా అన్ని వర్గాల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు అమలు చేసి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేశారని గుర్తుచేశారు. ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నేటికీ ప్రజలకు స్ఫూర్తిగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. “సంక్షేమ పాలనకు చెరగని సంతకం.. పేదల గుండెల్లో శాశ్వత స్థానం.. వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం” అని కొనియాడారు.
ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని వైఎస్సార్‌కు ఘన నివాళులు అర్పించారు.

పెద్దవంగరలో ఘనంగా వైఎస్సార్ 17వ వర్ధంతి నిర్వహణ

-ప్రజా సంక్షేమానికి చిరస్మరణీయ నాయకుడిగా వైఎస్ సేవలను స్మరించిన కాంగ్రెస్ నాయకులు



పెద్దవంగర, సెప్టెంబర్ 2: (మహాప్రభ)
మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి 17వ వర్ధంతిని పెద్దవంగర మండల కేంద్రంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు రంగు మురళి వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన సేవలను స్మరించారు. ఈ సందర్భంగా రంగు మురళి మాట్లాడుతూ, వైఎస్సార్ రైతు సంక్షేమానికి జీవితాన్ని అంకితం చేసిన ప్రజానాయకుడని కొనియాడారు. జలయజ్ఞం ద్వారా సాగునీటి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టి, కాలువల ద్వారా నీటిని అందించి రైతుల కష్టాలను తీర్చిన జలప్రదాతగా నిలిచారని పేర్కొన్నారు. ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, 108 అత్యవసర సేవలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతు రుణమాఫీ వంటి సంక్షేమ పథకాలతో ప్రజల జీవితాల్లో వైఎస్సార్ చెరగని ముద్ర వేశారని అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో మహానేతగా ఆయన జ్ఞాపకాలు నేటికీ ప్రజల హృదయాల్లో సజీవంగా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకుడు సంకేపల్లి రవీందర్ రెడ్డి, మండల నాయకులు పొడిశెట్టి సైదులు, దాసరి శీను, పన్నీరు వేణు, బండారి వెంకన్న, ముస్కు శోభన్, బీసు హరికృష్ణ, రహీం, భాష, బొల్లు గణేష్, చట్టు యాకన్న, కేశబోయిన సుభాష్, మాలే మోహన్‌రావు, శివరాత్రి సంపత్, కనుకుంట్ల నరేష్, అనపురం శ్రీనివాస్, ఆవుల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

లియాఫీ ఆధ్వర్యంలో ఎల్ఐసి ఏజెంట్ల

కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య శిబిరం...
ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయం...
వనపర్తి బ్రాంచ్ మేనేజర్ చక్రవర్తి

మహాప్రభ వనపర్తి జిల్లా న్యూస్
లియాఫీ ఆధ్వర్యంలో ఎల్ఐసి ఏజెంట్ల కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని వనపర్తి బ్రాంచ్ మేనేజర్ చక్రవర్తి అన్నారు. మంగళవారం,బుధవారం వనపర్తి ఎల్ఐసి బ్రాంచ్ లియాఫీ అధ్యక్షుడు కృష్ణ, కార్యదర్శి రాజశేఖర్,కోశాధికారి ప్రభాకర్ సౌజన్యంతో ఎల్ఐసి 70వ భీమా వారోత్సవాల సందర్భంగా యశోద హాస్పిటల్ (మలక్ పేట)సహకారంతో ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు.మారుతున్న జీవనశైలి వల్ల వస్తున్న అనారోగ్య సమస్యల పట్ల ఎల్ఐసి ఏజెంట్లు పడుతున్న కష్టాలు ఎనలేనివని వారు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం వల్ల ఏజెంట్లకు ఆర్థిక భారం తగ్గుతుందని పేర్కొన్నారు. లియాఫీ యూనియన్ చేస్తున్న సామాజిక సేవను ఈ సందర్భంగా కొనియాడారు.ఈ శిబిరంలో దాదాపు 400 మందికి షుగర్, బీపీ, ఈసీజీ, 2డీ ఎకో మరియు థైరాయిడ్ పరీక్షలు, కంటి పరీక్షలు నిర్వహించి మందులు, కళ్లద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులను శాలువా, పూల బొకేలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఏబీఎం కృష్ణ ప్రసాద్,ఎల్ఐసి బ్రాంచ్ సిబ్బంది, లియాఫీ యూనియన్ నాయకులు, డెవలప్ మెంట్ ఆఫీసర్లు, యశోద ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

ప్రజలకు భద్రతతో కూడిన స్మార్ట్ రేషన్ కార్డులు

-ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం
-మెదక్ ఎమ్మెల్యే డా.మైనంపల్లి రోహిత్ రావు



మెదక్ జిల్లా. 02సెప్టెంబర్(మహాప్రభ
.ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అన్నారు.బుధవారం రోజు మండల కేంద్రమైన పాపన్నపేట ఎంపీడీవో కార్యాలయంలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ, సీఎంఆర్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ ప్రజలకు మరింత పారదర్శకంగా, అవకతవకలకు తావు లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు క్యూఆర్ కోడ్ భద్రతతో కూడిన ట్యాంపర్ ప్రూఫ్ స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడంతో పాటు స్మార్ట్ రేషన్ కార్డులను అందుబాటులోకి తీసుకురావడం సంతోషంగా ఉందని తెలిపారు.మెదక్ నియోజకవర్గం అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు. లబ్ధిదారులకు కార్డులు అందించడం ఆనందంగా ఉందని తెలిపారు. ప్రజలకు ప్రాథమిక సౌకర్యాల కోసం ఇబ్బందులు ఉండకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందని పేర్కొన్నారు.కొత్త సాంకేతికతతో రూపొందించిన ఈకార్డుల ద్వారా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను పారదర్శకంగా అందించడం జరుగుతుందని తెలిపారు.ఆరు గ్యారంటీల అమలులో స్మార్ట్ కార్డులు కీలకంగా మారనున్నాయని, రాష్ట్రంలో ప్రజాపాలన నిరంతరం కొనసాగుతుందని వెల్లడించారు.రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు ప్రతి వ్యక్తికి నెలకు 6 కిలోల చొప్పున సన్నబియ్యం అందిస్తోందని,రైతులు పండించిన సన్నరకం వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాల్‌కు రూ.500 రూపాయల బోనస్ అందిస్తుందని తెలిపారు.రేషన్ కార్డు ద్వారా అర్హులైన లబ్ధిదారులు వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందవచ్చన్నారు. ప్రజలకు మరింత పారదర్శకంగా, సాంకేతికత ఆధారంగా సేవలు అందించేందుకు స్మార్ట్ రేషన్ కార్డులు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు.అట్టడుగు వర్గాల ప్రజలకు ఎలాంటి అవకతవకలు జరగకుండా ప్రభుత్వ పథకాలు అందించేందుకు డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులను రూపొందించడం జరిగిందని తెలిపారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని పేర్కొన్నారు.సీఎంఆర్ఎఫ్ పేదలకు వరమన్నారు. నిరుపేదలను ఆదుకోవడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ సతీష్ కుమార్,ఎంపీడీవో విష్ణువర్ధన్,మండల పార్టీ అధ్యక్షులు నరేందర్ గౌడ్, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు నీరుడి వెంకటేశం,కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రశాంత్ రెడ్డి,డీసీసీ అధికార ప్రతినిధి శ్రీకాంతప్ప, నాయకులు మల్లప్ప, గోవింద్ నాయక్,నాని, భూమయ్య,సంతోష్ రెడ్డి, సతీష్,ఆయా గ్రామాల సర్పంచులు శ్రీధర్, వెంకయ్య,శ్రీనివాస్, దండెం సుశీల,తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి అభివృద్ధిపై బీఆర్ఎస్‌కు కాంగ్రెస్ కౌంటర్

- వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై హర్షం
- మదన్ మోహన్ నాయకత్వంపై ప్రశంసలు
- బీఆర్ఎస్ పదేళ్లలో ఎల్లారెడ్డి కి చేసిన అభివృద్ధిపై లెక్క చెప్పాలని డిమాండ్



ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 2, (మహాప్రభ):
కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా బీఆర్ఎస్ చేపట్టిన నిరసనలకు ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గట్టి కౌంటర్ ఇచ్చారు. గత బీఆర్ఎస్ పాలనలో ఇచ్చిన హామీలు, చేపట్టిన అభివృద్ధి పనులపై ఆ పార్టీ నాయకులు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నాయకులు.. తమ పదేళ్ల పాలనలో ఎల్లారెడ్డి నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి, తీసుకొచ్చిన నిధులపై ప్రజలకు లెక్క చెప్పాలని కాంగ్రెస్ మండల అధ్యక్షులు సవాల్ విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ హామీలను దశలవారీగా అమలు చేస్తోందని తెలిపారు.
కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు:
– రైతులకు రుణమాఫీ
– మహిళలకు ఉచిత బస్సు
––గృహ వినియోగదారులకు ఉచిత విద్యుత్
– రూ.500కే గ్యాస్ సిలిండర్
–ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం
ఎల్లారెడ్డి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు:
ఎమ్మెల్యే మదన్ మోహన్ నాయకత్వంలో నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని కాంగ్రెస్ నాయకులు తెలిపారు.
– ఎల్లారెడ్డి మండలంలో భారీ ట్యాంక్‌బండ్ నిర్మాణం
– ఏటీసీ సెంటర్ అభివృద్ధి
– యంగ్ ఇండియా స్కూళ్ల ఏర్పాటు
–గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం
– మహిళా సంఘాల భవనాల నిర్మాణం
–గ్రామపంచాయతీ భవనాల నిర్మాణం
– గాంధారి, తాడ్వాయి మండలాల్లో క్రీడా మైదానాలు, స్టేడియాల అభివృద్ధి
– లింగంపేట మండలంలోని నాగన్నబావిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసే చర్యలు
– వివిధ గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు, భవనాలు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధి
ఆపదలో అండగా.. CMRF, LOC **ద్వారా ఆర్థిక సాయం:**
అత్యవసర వైద్య పరిస్థితుల్లో నియోజకవర్గ ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (జవీ=ఖీ), ూజల ద్వారా ఆర్థిక సహాయం అందించడంలో ఎమ్మెల్యే మదన్ మోహన్ ప్రత్యేక చొరవ చూపుతున్నారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. అవసరమైన వారికి సకాలంలో సహాయం అందేలా ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.
ప్రజలకు అందుబాటులో ఎమ్మెల్యే:
ఎమ్మెల్యే మదన్ మోహన్ నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, మండలాల వారీగా సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షులు తెలిపారు. గత పాలనలో అభివృద్ధి శూన్యంగా ఉందని, కాంగ్రెస్ పాలనలో చేపడుతున్న పనులు ప్రజల కళ్లముందే కనిపిస్తున్నాయని అన్నారు.
బీఆర్ఎస్ నాయకులు రాజకీయ విమర్శలకు పరిమితం కాకుండా తమ పదేళ్ల పాలనలో ఎల్లారెడ్డి నియోజకవర్గానికి చేసిన అభివృద్ధిపై ప్రజలకు లెక్క చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే మదన్ మోహన్ నాయకత్వంలో నియోజకవర్గ అభివృద్ధిని మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని ఎల్లారెడ్డి, లింగంపేట, నాగిరెడ్డిపేట, తాడ్వాయి, గాంధారి, రామారెడ్డి, రాజంపేట తదితర మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సైబర్ విజ్ఞానంతోనే మోసాలకు చెక్

-వినాయకుడి బోధనలతో సైబర్ భద్రతపై అవగాహన
-పోస్టర్‌ను ఆవిష్కరించిన మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్



మెదక్ జిల్లా -02సెప్టెంబర్ (మహాప్రభ).
సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ సూచించారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో వినాయక చవితి సందర్భంగా రూపొందించిన సైబర్ భద్రత అవగాహన పోస్టర్‌ను బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ ఆవిష్కరించారు.
వినాయకుడి నుంచి సైబర్ భద్రత పాఠాలు' అనే సందేశంతో రూపొందించిన పోస్టర్‌లో సైబర్ మోసాల పట్ల ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వినూత్నంగా వివరించారు. వినాయకుడి పెద్ద చెవులు ప్రతి విషయాన్ని జాగ్రత్తగా వినాలని, చిన్న కళ్లతో నిశితంగా గమనించాలని, పెద్ద తలతో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని సూచిస్తున్నట్లుగా పోస్టర్‌లో అవగాహన కల్పించారు. అత్యాశ, భయం, తొందరపాటు వంటి భావోద్వేగాలను సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా మలుచుకుంటారని, ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని ఎస్పీ సూచించారు.తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్, మెసేజ్‌లు, ఈ-మెయిల్స్ విషయంలో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. అనుమానాస్పద లింకులను క్లిక్ చేయడం, గుర్తుతెలియని యాప్‌లను డౌన్‌లోడ్ చేయడం చేయవద్దన్నారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం/డెబిట్ కార్డు సమాచారం, పాస్‌వర్డ్‌లు, ఓటీపీ, పిన్ వంటి రహస్య సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని స్పష్టం చేశారు.ఆన్‌లైన్ ఉద్యోగాలు, పెట్టుబడులు, రుణాలు, బహుమతులు, లాటరీల పేరుతో వచ్చే ఆకర్షణీయమైన ప్రకటనలను నమ్మి మోసపోవద్దని సూచించారు. సోషల్ మీడియాలో అపరిచితులతో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దన్నారు. ఖాతాల భద్రత కోసం బలమైన పాస్‌వర్డ్‌లు ఏర్పాటు చేసుకుని టూ-ఫ్యాక్టర్ ఆథెంటికేషన్ వినియోగించాలని తెలిపారు.ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే ఆలస్యం చేయకుండా 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని, ఆన్ లైన్ సైబర్ క్రైమ్ లో ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు. మోసం జరిగిన వెంటనే స్పందిస్తే డబ్బును తిరిగి పొందే అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. ప్రజల్లో సైబర్ భద్రతపై అవగాహన పెంపొందించేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఎస్పీ పేర్కొన్నారు.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com